తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం-14- ఆగస్టు - 2025 | సంపుటి : 3 | సంచిక : 79 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# రాష్ట్ర వ్యాప్తంగా భూములకు భూధార్ నంబర్ల కేటాయింపు

- ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభానికి సీఎం ఆదేశాలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

రాష్ట్ర వ్యాప్తంగా భూములకు భూధార్ నంబర్లు కేటాయింపునకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. రెవెన్యూ సభల్లో వారసత్వం, ఇతర మ్యూటేషన్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు.

మిగతా 2లో

# సుప్రీంకోర్టు సంచలన తీర్పు





## ఎమ్మెల్సీ కోదండరామ్,అమీర్ అలీ ఖాన్ నియామకాల రద్దు

- బీఆర్ఎస్ నేతల పిటిషన్‌పై ధర్మాసనం తీర్పు
- తాజా నామినేషన్లపై తుది తీర్పు వరకు స్టే
- తీర్పుపై అమీర్ అలీ ఖాన్ తొలి స్పందన

ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు:

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమితులైన కోదండరామ్, అమీర్ అలీ ఖాన్ నియామకాలను సుప్రీంకోర్టు రద్దు చేసింది. బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్‌లపై విచారణ జరిపిన ధర్మాసనం, ఈ నియామకాలు చెల్లవని తేల్చింది. రెండు ఎమ్మెల్సీ స్థానాలపై తాజా నామినేషన్లు తుది తీర్పు వరకు అమల్లో ఉండవని స్పష్టం చేసింది. కోదండరామ్, అమీర్ అలీ ఖాన్ నియామకాలు అక్రమంగా జరిగాయని బీఆర్ఎస్ నేతలు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లగా,

మిగతా 2లో



# ఎమ్మెల్సీల రద్దుపై కేటీఆర్ రియాక్షన్


## సుప్రీంకోర్టు తీర్పు బీజేపీ, కాంగ్రెస్‌కు చెంపపెట్టు

- బీజేపీ, కాంగ్రెస్‌పై ప్రజాస్వామ్య విరుద్ధ చర్యల ఆరోపణలు
- బీఆర్ఎస్ నామినేషన్లకు అడ్డుకట్ట వేసిన రెండు జాతీయ పార్టీలు
- న్యాయవ్యవస్థకు బీఆర్ఎస్ కృతజ్ఞతలు

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

ఎమ్మెల్సీలు కోదండరాం, అలీ ఖాన్‌ల నియామకం రద్దు చేసిన సుప్రీంకోర్టు తీర్పును మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వాగతించారు. ఈ తీర్పు అటు బీజేపీకి, ఇటు కాంగ్రెస్‌కు చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు.

గతంలో బీజేపీ గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేసి, బీఆర్ఎస్ సిఫారసు చేసిన ఇద్దరు ఎమ్మెల్సీల ప్రతిపాదనలకు అడ్డుపడ్డారని గుర్తు చేశారు.



మిగతా 2లో



# బాలల హక్కుల కమిషన్ కార్యకలాపాలపై మంత్రి సీతక్క సమీక్ష

## నేటి బాలలే రేపటి తెలంగాణ భవిష్యత్తు పౌరులు

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధ్యక్షతన బాలల హక్కుల కమిషన్ కార్యకలాపాలపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సభ్యులు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ సృజన, సంబంధిత అధికారులు హాజరయ్యారు.

మిగతా 2లో

# ఎమ్మెల్సీల రద్దుపై సగం సమాచారం మాత్రమే ప్రచారం

## ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



- సుప్రీంకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ నేతల ప్రచారంపై దయాకర్ విమర్శ
- సెప్టెంబర్ 17న ఫైనల్ హియరింగ్‌పై ఎమ్మెల్సీ ధీమా
- గవర్నర్ నిర్ణయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ పాత్ర
- గత ప్రభుత్వంపై పత్రాల లోపం ఆరోపణలు

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

ఎమ్మెల్సీలు కోదండరాం,అమీర్ అలీఖాన్‌ల విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ నేతలు తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆరోపించారు. ఇద్దరు ఎమ్మెల్సీలు రద్దు అయ్యారని సగం సమాచారంతో ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

సుప్రీంకోర్టు పూర్తి వాదనలను వినడానికి సెప్టెంబర్ 17 తేదీని నిర్ణయించిందని, ఆ రోజు తమకు అనుకూల అంశాలను న్యాయస్థానానికి సమగ్రంగా వివరించనున్నట్లు చెప్పారు. ఆ ఫైనల్ హియరింగ్‌లో తమ వాదనలు న్యాయం సాధించగలవని ధీమా వ్యక్తం చేశారు.

గత గవర్నర్ తిరస్కరించిన ఖాళీలను రెండు సంవత్సరాలు

మిగతా 2లో

# అవసరమైతే తప్ప... బయటకు రావద్దు





- నగర ప్రజలకు హైడ్రా కమిషనర్ కీలక సూచన

2లో

# ఫార్మా, బల్క్ డ్రగ్ కం పెనీలు ప్రమాణాలు పాటించాలి

## పీసీబీ అధికారులపై మంత్రి కొండా సురేఖ ఆగ్రహం

- ఫార్మా కంపెనీలకు పర్యావరణ ప్రమాణాలపై మంత్రి సురేఖ ఆదేశాలు
- పరిశ్రమలపై కఠిన పర్యవేక్షణ, టాస్క్ ఫోర్స్ ఏర్పాటుకు సూచన
- చౌటుప్పల్‌లో నీటి కాలుష్యంపై హెచ్చరికలు
- భావి తరాల కోసం నీటి వనరుల సంరక్షణపై దృష్టి



2లో



# చనిపోయినవాళ్లతో టీ తాగాను

- లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- ఓటరు జాబితా అవకతవకలపై ఘాటుగా స్పందించిన రాహుల్ గాంధీ

ఢిల్లీ,తెలంగాణ ముచ్చట్లు:

బీహార్‌లో ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. బుధవారం తన పర్యటనలో "చనిపోయినవాళ్లతో" టీ తాగానని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. బీహార్‌లో అధికారులు జీవించి ఉన్న వ్యక్తులను మరణించినట్లుగా రికార్డుల్లో చూపించి, వారి ఓటు హక్కులను తొలగించారని ఆరోపించారు.

"నా జీవితంలో అనేక అనుభవాలు ఎదుర్కొన్నాను. కానీ చనిపోయిన వ్యక్తులతో టీ తాగే అవకాశం మాత్రం ఇప్పటివరకు రాలేదు. ఈ ప్రత్యేకమైన అనుభవానికి ఎన్నికల సంఘానికి ధన్యవాదాలు!" అని రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు.

# రాష్ట్ర వ్యాప్తంగా భూములకు భూధార్ నంబర్ల కేటాయింపు

(మొదటి పేజీ తరువాయి)




కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ, గృహనిర్మాణ శాఖలపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి, లైసెన్స్ పొందిన సర్వేయర్లు చేసిన సర్వేలను రెగ్యులర్ సర్వేయర్లు పరిశీలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కోర్ అర్బన్ ప్రాంతాల్లో నిర్మించనున్న 10 కొత్త సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నమూనాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రతి కార్యాలయంలో పార్కింగ్, క్యాంటీన్, మౌలిక వసతులు ఏర్పాటు చేసి, ప్రజలకు సౌకర్యవంతమైన, స్నేహపూర్వక వాతావరణం కల్పించాలన్నారు.

పలు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయ్యిందని అధికారులు నివేదించగా, ఈ నెలాఖరులోగా వాటి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. హైదరాబాద్ నగరంలోని హౌసింగ్ బోర్డుతో జాయింట్ వెంచర్ ప్రాజెక్టుల్లో తలెత్తిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు.

# సుప్రీంకోర్టు సంచలన తీర్పు




)మొదటి పేజీ తరువాయి)

తిరస్కరణ రావడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ సందర్భంగా బుధవారం విచారణ జరిపిన ధర్మాసనం, ఆగస్టు 14, 2024 తీర్పులో మార్పులు చేస్తూ, నియామకాలను రద్దు చేసింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 17కు వాయిదా వేసింది. తాజా తీర్పుపై ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ స్పందిస్తూ, ఇలాంటి నిర్ణయం వస్తుందని ఊహించలేదని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను చదివిన తర్వాతే పూర్తి వివరాలు చెబుతానని అన్నారు. తాను జర్నలిస్టుగా ఉన్నానని, ఎలాంటి రాజకీయ నేపథ్యం లేనని, ఈ అంశంపై ఇంకా ప్రభుత్వ పెద్దలు మాట్లాడలేదని స్పష్టం చేశారు.



# ఎమ్మెల్సీల రద్దుపై కేటీఆర్ రియాక్షన్



(మొదటి పేజీ తరువాయి)

ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఆ ప్రక్రియ పెండింగ్‌లో ఉండగానే మరో ఇద్దరి పేర్లను సిఫారసు చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని విమర్శించారు.

బీఆర్ఎస్ నామినేట్ చేసిన బడుగు, బలహీనవర్గాలకు చెందిన దాసోజు శ్రవణ్, సత్యనారాయణ అభ్యర్థిత్వాలను అడ్డుకున్న కాంగ్రెస్, బీజేపీల అసలు స్వరూపం మరోసారి బయటపడిందని కేటీఆర్ అన్నారు. రాజ్యాంగంపై గౌరవం లేని ఈ రెండు ఢిల్లీ పార్టీల అప్రజాస్వామిక విధానాలను న్యాయవ్యవస్థ తిప్పికొట్టిందని పేర్కొన్నారు.

“ప్రజాస్వామ్యానికి తగిన గౌరవం చాటిచెప్పిన సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్ పక్షాన శిరస్సు వంచి సలాం చేస్తున్నాం” అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# బాలల హక్కుల కమిషన్ కార్యకలాపాలపై మంత్రి సీతక్క సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)



సమావేశంలో కమిషన్ ఏర్పాటైన నాటి నుండి చేపట్టిన కార్యక్రమాలు, అమలు చేసిన చర్యలు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి అవసరమైన వనరులపై చర్చ జరిగింది. జిల్లాస్థాయిలో శాఖ నుండి మరింత సహకారం అందించాలని కమిషన్ విజ్ఞప్తి చేసింది.

ప్రతి చిన్నారికి ఆరోగ్యకరమైన, సంతోషకరమైన బాల్యం అందించేందుకు మిషన్ వాత్సల్య ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. జిల్లాల వారీగా సిబ్బంది నియామకాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యుల నియామకానికి దరఖాస్తుల గడువు ఈ నెల 8తో ముగిసినా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో, గడువు పెంపు సాధ్యాసాధ్యాలను పరిశీలించి న్యాయ సలహా తీసుకొని నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో కమిషన్ మరింత క్రియాశీలకంగా పనిచేయడానికి శాఖ పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. నేటి బాలలే రేపటి తెలంగాణ భవిష్యత్తు పౌరులని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన “తెలంగాణ రైజింగ్-2047” లక్ష్యసాధనలో నేటి బాలలదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు.

# ఎమ్మెల్సీల రద్దుపై సగం సమాచారం మాత్రమే ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

నింపకపోవడం తమ ప్రభుత్వ కాలంలో జరగలేదని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గవర్నర్ సానుకూలంగా నిర్ణయం తీసుకున్నారని, వారిద్దరు ఎమ్మెల్సీలు ప్రమాణస్వీకారం చేసి సభా కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారని గుర్తుచేశారు.

గతంలో కేసీఆర్ సరైన పత్రాలు సమర్పించకపోవడం, రాజ్యాంగబద్ధంగా నియామకం చేయకపోవడంతో అప్పటి గవర్నర్ తమిళిసై ఆ నియామకాలను తిరస్కరించారని అద్దంకి దయాకర్ ఆరోపించారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగం, చట్టాలకు విరుద్ధంగా ఏ నియామకం చేయలేదని ఆయన స్పష్టం చేశారు.





# దొంగ ఓట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం మాకు లేదు

- **బీజేపీ ఎంపీ రఘునందన్ రావు**

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

దొంగ ఓట్ల ఆధారంగా రాజకీయాలు చేయాల్సిన అవసరం తమకు లేదని బీజేపీ ఎంపీ ఎం.రఘునందన్ రావు తెలిపారు. అందుకే ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చేపడుతున్నామని చెప్పారు. ఈ సవరణను తెలంగాణలో కూడా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన రఘునందన్ రావు, దొంగ ఓట్లు ఎవరు చేర్చారో విచారణ జరిపి నిజాలు బయటపెట్టాలని అన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తప్పనిసరిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దొంగ ఓట్లు ఉన్నాయని చెబుతూనే ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకం అవుతున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే తెలంగాణలో సవరణ జరగాలని సూచించారు.

ఓట్ల చోరీపై బాధ్యత వహించాల్సిన నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదాహరణగా ఉమ్మడి మెదక్ జిల్లా పటాన్‌చెరువులోని ఐలాపూర్ గ్రామంలో జరిగిన విషయాన్ని ప్రస్తావించారు. పార్లమెంట్ ఎన్నికల కంటే ముందు విడుదలైన ఓటర్ల తుది జాబితాలో 700కి పైగా దొంగ ఓట్లు గుర్తించామన్నారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, ఎమ్మార్వో, ఎన్నికల సంఘం సీఈవో వికాస్ రాజ్‌కి ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదని అన్నారు. శ్మశానానికి, పాఠశాలకు కూడా డోర్ నంబర్లు కేటాయించిన విషయాన్ని ఎత్తిచూపారు. పోలింగ్ స్టేషన్ల సంఖ్యను కూడా మారుస్తూ పెంచారని తెలిపారు.

ఓటర్ల జాబితాను సమీక్షించి రివిజన్ చేయాల్సిన అవసరం ఉందని రఘునందన్ రావు పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున, రాహుల్ గాంధీ స్వయంగా ప్రత్యేక సమగ్ర సవరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క గ్రామంలోనే ఇంత దొంగ ఓట్లు ఉంటే దేశవ్యాప్తంగా పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు.

# అవసరమైతే తప్ప... బయటకు రావద్దు

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:**



భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో హైదరాబాద్ నగర ప్రజలు అత్యవసరమైన సందర్భాలు తప్పించి బయటకు వెళ్లకూడదని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సూచించారు. వాతావరణ శాఖ ప్రకారం బుధవారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు విస్తారంగా, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన రంగనాథ్, విపత్తు పరిస్థితులు ఎదురైనా వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు మున్సిపల్, ట్రాఫిక్, జలమండలి, విద్యుత్ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తయ్యాయని వివరించారు. లోతట్టు ప్రాంతాల్లో వరద ముప్పు తలెత్తిన సందర్భంలో బోట్లు, రక్షణ బృందాలు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. రాత్రి సమయంలో వర్షపాతం అధికం అయ్యే అవకాశం ఉండడంతో హైడ్రా బృందాలు రాత్రి నుంచే మైదానంలో ఉంటాయని పేర్కొన్నారు. నాలాల కబ్జాల కారణంగానే రహదారులపైకి భారీగా వరద నీరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డుపై 400కిపైగా వాటర్ లాగింగ్ పాయింట్లు ఉండగా, ప్రధాన ప్రాంతాల్లో ఇప్పటికే సిబ్బంది మోహరించారని తెలిపారు. భారీ వర్షాల సమయంలో సహాయక చర్యల్లో పాల్గొనాలని, ముఖ్యంగా యువత ముందుకు రావాలని రంగనాథ్ పిలుపునిచ్చారు.



# ఫార్మా, బల్క్ డ్రగ్ కంపెనీలు ప్రమాణాలు పాటించాలి

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

రాష్ట్ర పర్యావరణ పరిరక్షణలో ఫార్మా, బల్క్ డ్రగ్ కంపెనీలు కచ్చితమైన ప్రమాణాలను పాటించాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. బుధవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో, అనుమతుల ఉల్లంఘనలు, నీటి కాలుష్యం, గాలి కాలుష్యం వంటి అంశాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

పీసీబీ అధికారులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పరిశీలనలు జరుపుతున్నారని సభ్య కార్యదర్శి జి. రవి వివరించగా, మంత్రి పరిశ్రమలపై మరింత కఠినమైన పర్యవేక్షణ అవసరమని సూచించారు. అవసరమైతే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఫారెస్ట్, రెవెన్యూ, సెంట్రల్ పీసీబీ ప్రతినిధులతో ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లో నీటి కాలుష్యంపై విపరీతమైన ఫిర్యాదులు వస్తున్నాయని, పర్యావరణ చట్టాల మేరకు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యమైన సమావేశానికి కొన్ని కంపెనీ ప్రతినిధులు గైర్హాజరు కావడంపై అసహనం వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు తగిన గౌరవం, బాధ్యతతో వ్యవహరించాలని హితవు పలికారు.

“కరోనా తర్వాత పర్యావరణ భద్రత మరింత కీలకం అయింది. కాలుష్యం జరిగి మానవ ఇబ్బందులు కలగకముందే నివారించాలి” అని పీసీబీ అధికారులకు, పరిశ్రమల ప్రతినిధులకు మంత్రి సురేఖ సూచించారు. నీటి వనరులను భావి తరాలకు కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ఏఐలో దేశంలోని అత్యంత ప్రభావశీల నేతల్లో మంత్రి శ్రీధర్ బాబు

- **టెక్నాలజీ అభివృద్ధిలో తెలంగాణ ముందంజ**
- **మంత్రి శ్రీధర్ బాబుకు సీఎం రేవంత్ అభినందన**

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగంలో దేశవ్యాప్తంగా అత్యంత ప్రభావశీల నేతల జాబితాలో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు చోటు దక్కించుకున్నారు. ‘అనలిటిక్స్ ఇండియా’ తాజాగా విడుదల చేసిన ఇండియాస్ 100 మోస్ట్ ఇన్ఫ్లుయెన్షియల్ లీడర్స్ ఇన్ ఏఐ - 2025 జాబితాలో ఆయన కీ పాలసీ మేకర్స్ విభాగంలో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శ్రిదర్ బాబు రాష్ట్రాన్ని కేవలం స్టార్టప్ రాజధానిగానే కాకుండా, సమగ్ర ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతున్నందుకు అభినందనలు తెలిపారు. ఆవిష్కరణలు, దూరదృష్టి విధానాలను ప్రోత్సహిస్తూ తెలంగాణను ఏఐ విప్లవంలో అగ్రస్థానంలో నిలపడానికి ఆయన చేస్తున్న కృషిని సీఎం ప్రశంసించారు. ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు, దేశంలో ఏఐ అభివృద్ధికి దోహదపడుతున్న నేతల నాయకత్వం, దూరదృష్టికి నిదర్శనమని సీఎం పేర్కొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# భూపాలపల్లి జిల్లాలో కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలి

- **వరంగల్ ఎంపీ కడియం కావ్య**

**న్యూఢిల్లీ,తెలంగాణ ముచ్చట్లు:**





జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేంద్రీయ విద్యాలయం, జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య కేంద్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి సంజయ్ కుమార్‌ను కోరారు. ఢిల్లీలో బుధవారం మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు.

భూపాలపల్లిలో సింగరేణి, ప్రభుత్వ, ప్రైవేట్, ఐటీ రంగ ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉన్నారని, వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందించడానికి కేంద్రీయ విద్యాలయం అవసరమని ఎంపీ పేర్కొన్నారు. ఉద్యోగుల బదిలీల కారణంగా పిల్లల చదువులో అంతరాయం లేకుండా ఉంటుందని వివరించారు.

అలాగే, జిల్లాలో ఇప్పటివరకు నవోదయ పాఠశాల లేకపోవడంతో ప్రతిభావంతులైన గ్రామీణ పిల్లలు మంచి రెసిడెన్షియల్ విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. అవసరమైన స్థలం, సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.వినతిని సానుకూలంగా స్వీకరించిన కార్యదర్శి సంజయ్ కుమార్, కేంద్రీయ విద్యాలయం, నవోదయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# కార్మిక సమస్యల పరిష్కారానికి ఐఎన్టీయూసీ పోరాటం!

- **నేడు జి.ఎం కార్యాలయం ముందు జరిగే ధర్నా విజయవంతం చేయాలని పిలుపు.**
- **బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్.**

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**



స్థానిక సత్తుపల్లి పట్టణం సింగరేణి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఆదేశాల మేరకు జే.వి.ఆర్ సి.హెచ్.పి లో ఐఎన్టియుసి ఫిట్ సెక్రటరీ పోగుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

క్రాంతి కుమార్ మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగులు సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్నా సమస్యల పరిష్కారం కోసం ఐఎన్టియుసి యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. సింగరేణి పరిరక్షణకై దశల వారి ఆందోళనలో భాగంగా ఈరోజు గురువారం కొత్తగూడెం జి.ఎం కార్యాలయం ముందు జరిగే ధర్నాలో సింగరేణి కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని సమస్యల పరిష్కారానికి పోరాటం చేయవలసిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో రామారావు ( ఫిట్ సెక్రటరీ జే.వి.ఆర్ ఓసి), బాలాజీ (ఫిట్ సెక్రటరీ కిష్టారం ఓసి), సెంట్రల్ కమిటీ నాయకులు, బ్రాంచ్ కమిటీ నాయకులు, ఫిట్ కమిటీ నాయకులు, ఇతర ముఖ్య కమిటీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# సత్తుపల్లి సింగరేణిలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన అధికారులు.!

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**

సత్తుపల్లి సింగరేణి అధికారుల సంఘం పిలుపుమేరకు జే.వి.ఆర్ సి.హెచ్.పి లో సీ.ఎం.ఓ.ఏ.ఐ కొత్తగూడెం ఏరియా జాయింట్ సెక్రటరీ ఆలుగోలు ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో సింగరేణి అధికారుల వేతనాల్లో భాగమైన పిఆర్పి చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ సింగరేణి అధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తూ విధులకు హాజరయ్యారు.

సింగరేణిలో అధికారుల పలు సమస్యలు గురించి ముఖ్యంగా ఫ్రీ ఎలక్ట్రిసిటీ చార్జెస్, ఐఐటి, ఐఐఎం ఫీజు రియంబర్స్మెంట్ వర్తింపు దీర్ఘకాలిక పదోన్నతులు ఇతర సమస్యలు పరిష్కరించాలని, సింగరేణి అధికారుల సంఘం ఆధ్వర్యంలో అధికారులు సుదీర్ఘకాలంగా పోరాడుతున్నారు అని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా సీ.ఎం.ఓ.ఏ.ఐ నాయకులు, సత్తుపల్లి జే.వి. ఆర్ సి.హెచ్.పి అధికారులు పాల్గొన్నారు.

# రక్తదానం చేయండి - ప్రాణదాతలు కండి.!

- **కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జూపల్లి రమేష్.**
- **మండల అధ్యక్షులు తుమ్మ రాంబాబు.**

**దమ్మపేట, తెలంగాణ ముచ్చట్లు:**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట నియోజకవర్గం, అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో (నేడు) గురువారం ఉదయం 11 గంటలకు జరగనున్న రక్తదాన శిబిరం ఏర్పాటుకు ముఖ్య అతిథిగా అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ పాల్గొననున్నారు.

ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, గ్రామశాఖ అధ్యక్షులు, మహిళా కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేయవలసిందిగా తెలిపారు.

# సింగరేణిలో ఘనంగా జనక్ ప్రసాద్ జన్మదిన వేడుకలు.!

- **బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతికుమార్.**

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**



స్థానిక సత్తుపల్లి పట్టణం సింగరేణిలో కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఆదేశాల మేరకు బుధవారం జే.వి.ఆర్ ఓసి , కిష్టారం ఓసి , జే.వి.ఆర్ సి.హెచ్.పి లలో ఐఎన్టియూసి ఫిట్ కార్యదర్శిలు రామారావు, బాలాజీ, నాగేశ్వరరావు ల ఆధ్వర్యంలో బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్, ఐ.ఎన్.టి.యు.సి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ 73 వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్ మాట్లాడుతూ, కార్మిక పక్షపాతి జనక్ ప్రసాద్ సింగరేణిలో ఒక సాధారణ ఉద్యోగి గా ఉద్యోగంలో చేరి అంచలంచెలుగా ఎదిగి నిరంతరం కార్మికుల హక్కుల కోసం పోరాడుతూ తన జీవితాన్ని ప్రజల కోసం, కార్మికుల కోసం అంకితం చేశారని అన్నారు. గతంలో సింగరేణిలో జాతీయ సంఘాలకు దీటుగా క్లారికల్ అసోసియేషన్ స్థాపించడంతో పాటుగా వివిధ క్రాఫ్ట్ సంఘాలను స్థాపించి 72 క్రాఫ్ట్ సంఘాలతో సాజక్ ఏర్పాటు లో కీలకపాత్ర పోషించారని తెలియజేశారు. జనక్ ప్రసాద్ కార్మిక వర్గమే తన కుటుంబంగా భావించి ఎన్నో కష్టాలు నిర్బంధాలు ఎదురైన నిరంతరం కార్మికుల కోసం కార్మిక హక్కుల పరిరక్షణ కోసం పాటుపడ్డారని కొనియాడారు. ఆయన పోరాటంతో కార్మిక వర్గానికి ఎన్నో హక్కులు సాధించబడ్డాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలతో జనక్ ప్రసాద్ నాయకత్వంలో సింగరేణి కార్మికుల చిరకాల కోరిక సొంత ఇంటి కల, పెర్క్స్ పై ఆదాయపన్ను రాయితీ, మారు పేర్లు సమస్య, మెడికల్ బోర్డు పునరుద్ధరణ, ట్రాన్స్ఫర్ పాలసీలలో మార్పు, నూతన బొగ్గు గనులు మరియు ఉద్యోగులకు మెరుగైన లాభాల వాటా ఇప్పించుటలో ఐఎన్టీయూసీ యూనియన్ పోరాటం చేస్తుందని తెలియజేశారు. ఐఎన్టీయూసీ యూనియన్ సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడే విషయంలో, నూతన హక్కుల సాధనలో ఎల్లపుడు కార్మికుల పక్షాన పోరాటం చేస్తుందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి నాయకులు అశ్వక్, నాగ ప్రకాష్, విశ్వేశ్వరరావు, కోటి, సురేష్, రఫీ, బాలు, మురళి, తిరుమలరావు, కలవల శ్రీనివాస్, సత్యనారాయణ, గోపి, గాజుల రవీందర్, ఈర్ల నగేష్, దొడ్డపల్లి రమేష్, శ్రీనివాసరావు, శ్రీధర్, వరప్రసాద్, కాజా, చంద్రశేఖర్, షరీఫ్, చంద్రగిరి మోహన్, రషీద్, మురళి, దామోదర్, శ్రీనివాస్, ఎర్రబెల్లి ఈశ్వర్, చార్లెస్, రామకృష్ణ , కాంపల్లి కృష్ణ, వెంకటేశ్వర్లు, సతీష్, రాజమౌళి, రాజశేఖర్, నజీర్, ఆఫ్రోజ్, శ్రీనివాస్, హమీద్, యాకూబ్, బాలరాజు, అన్వర్, సుధాకర్ ఇతర ముఖ్య నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల దృశ్య అందరూ అప్రమత్తంగా ఉండాలి

- **ఎమ్మెల్యే మేఘారెడ్డి తూడి**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ నుంచి అతి భారీ వర్షాల కారణంగా వనపర్తి జిల్లా ఎల్లో జోన్లో నుంచి రెడ్ జోన్ లోకి చేరుకుందని వాతావరణ అధికారులు తెలియజేశారు.కావున వనపర్తి నియోజకవర్గంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ...అత్యవసర పరిస్థితుల్లోనే ప్రయాణాలు చేయాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సూచించడమైనది.మట్టి మిద్దెల్లోనూ శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లల్లోనూ నివాసం ఉండేవారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చూసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అత్యవసరం ఉంటేనే ప్రయాణాలు చేయాలని వాగులు వంకలు ఉన్నచోట ప్రయాణాలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. వర్షాల కారణంగా ఇబ్బంది పడే వారికి నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు చేయూతనందించి సహకరించాలని ఆయన కోరారు.వర్షం కారణంగా ఎవరైనా అత్యవసర ఇబ్బందులకు గురైతే తనకు నేరుగా 9494216666 ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

# ఎల్లో జోన్ నుండి రెడ్ జోన్ లోకి వనపర్తి జిల్లా

- **జిల్లాలో భారీ వర్షా లు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
- **కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు**
- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



వనపర్తి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ గిరిధర్ రావుల పిలుపునిచ్చారు.బుధవారం వర్షాల నేపథ్యంలో మదనాపురం మండలం పరిధిలోని సరళా సాగర్ ప్రాజెక్టుకు నీటి ఉధృతి పెరిగిన కారణంగా జిల్లా కలెక్టర్ ఎస్పీతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టులో నీటి మట్టం ఉధృతిని దగ్గరుండి పరిశీలించారు.సరళ సాగర్ ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం గురించి అక్కడే ఉన్న నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 0.49 టీఎంసీల నీరు వచ్చి చేరిందని, రెండు వుడెన్ సైఫన్లు తెరుచుకున్నాయని నీటిపారుదల అధికారులు బదులిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న మూడు రోజులు భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సురక్షిత పరాంతాల్లో ఉండాలని సూచించారు. ఈ రెండు మూడు రోజులు ఏవైనా కార్యక్రమాలు ఉంటే వాయిదా వేసుకోవాలని సూచించారు. వాగులు కుంటలు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జిల్లా యంత్రాంగమంతా ప్రజలకు సహాయం చేసేందుకు సిద్ధంగా ఉందని ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదని చెప్పారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే కంట్రోల్ రూమ్ 08545 220351కు కాల్ చేసి తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. మదనాపురం మండల పరిధిలోని శంకరంపేట దంతనూరు గ్రామాల మధ్యన ప్రమాదకరంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో కలెక్టర్ ఎస్పీలు పరిశీలించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాజ్వేలు, బ్రిడ్జిల గుండా ఎవరిని అనుమతించవద్దని ఆదేశాలు జారీ చేశారు.ఎస్పీ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు అనవసరంగా బయటికి రాకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. మత్స్యకారులు కూడా రాబోయే రెండు మూడు రోజులు చేపల వేటకు వెళ్ళవద్దని సూచించారు. వనపర్తి కొత్తకోట నుండి ఆత్మకూరు వెళ్లే ప్రయాణికులు రాచాలమీదుగా దేవరకద్ర నుండి ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవాలని, మదనాపూర్ మీదుగా ఎవరు వెళ్ళవద్దని సూచించారు.వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని జిల్లా యంత్రాంగం పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉంటారని ఎస్పీ భరోసా ఇచ్చారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, నీటిపారుదల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం ప్రజలకు అండగా ఉంటాం

- **మాజీ ఎంపీ నామ**
- **కేటీఆర్ పిలుపుకు స్పందించిన - మాజీ ఎంపీ నామ**
- **బీఆర్ఎస్ శ్రేణులు సహాయక చర్యల్లో ముందుండాలని మాజీ ఎంపీ నామ పిలుపు**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు జలమయమై, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుకు ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు స్పందించాలని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు బుధవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ శ్రేణులు వెంటనే వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు త్రాగునీరు, పాలు, ఆహారం, దుస్తులు వంటి అవసరాలు తక్షణమే అందించాలన్నారు. ప్రభుత్వ అధికారులు, వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరారు. అవసరమైనచోట ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అత్యవసర వైద్య సహాయం, మందులు అందించాలన్నారు. బిఆర్ఎస్ నాయకులు సహాయక చర్యల్లో స్థానిక ప్రభుత్వ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కష్టకాలంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు అండగా ఉంటుందని పార్టీ కార్యకర్తలు, నాయకులు తమ వంతు సహాయాన్ని అందిస్తూ, ప్రతి ఒక్కరికీ ధైర్యం కలిగించాలి అని నామ కోరారు.



# మూసీ వాగు ఉధృతం

- **వరద పరిస్థితులను పరిశీలించిన రాచకొండ కమిషనర్**

**మేడ్చల్ మల్కాజ్‌గిరి, తెలంగాణ ముచ్చట్లు:**

హైదరాబాద్‌లో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల ప్రభావంతో మూసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో రాచకొండ పోలీసు కమిషనర్ జి. సుధీర్ బాబు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని భూదాన్ పోచంపల్లి సమీపంలోని జూలూరు మూసీ లెవెల్ బ్రిడ్జి, సంగం బ్రిడ్జిని బుధవారం పరిశీలించారు. వరదనీరు ఎక్కువగా వచ్చే పరిస్థితుల్లో రహదారులను తాత్కాలికంగా మూసివేయాలని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు సంబంధిత శాఖలు పూర్తిగా సిద్ధంగా ఉండాలని సూచించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వన మహోత్సవంలో మొక్కలు నాటిన ఉప్పల్ ఎమ్మెల్యే

**ఉప్పల్,తెలంగాణ ముచ్చట్లు:**

ఉప్పల్ నియోజకవర్గం ఏ.ఎస్. రావు నగర్ డివిజన్ పరిధిలోని పద్మశాలి టౌన్షిప్‌లో, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ శాసనసభ్యుడు బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డి తో కలిసి మొక్కలు నాటారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, పార్టీ నాయకులు కాసం మహిపాల్ రెడ్డి, కుమారస్వామి, మనెమ్మ, బేతాళ బాలరాజు, మురళి పంతులు, రహీం, యకయ్యతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.








# ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం అమలు చేయాలి

- పెండింగ్‌లో ఉన్న జూలై నెల పారితోషికాలు వెంటనే విడుదల చేయాలి
- మేడ్చల్ జిల్లా ఆశా యూనియన్ కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి

**కాప్రా, తెలంగాణ ముచ్చట్లు:**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్‌లోని కుషాయిగూడ పిహెచ్‌సీలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆశా వర్కర్ల సమస్యలను ప్రస్తావించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఆశా యూనియన్ కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఆశా వర్కర్లకు జూలై నెల పారితోషికాలు ఇప్పటికీ రాలేదని తెలిపారు. గతంలో ప్రతి నెల ముగింపు నాటికి చెల్లించేవారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత సకాలంలో చెల్లింపులు జరగడం లేదని విమర్శించారు. ఆశా వర్కర్లు రాష్ట్రంలో గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ, కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత వంటి సౌకర్యాలు లభించడం లేదని, ప్రస్తుతం నెలకు రూ.9,900 మాత్రమే అందుతున్నట్లు తెలిపారు. గత నాలుగేళ్లుగా వేతన పెంపు జరగక పోగా, ఈ కాలంలో పని భారం, నిత్యావసరాల ధరలు అనేక రెట్లు పెరిగాయని, ఫిక్స్డ్ వేతనం రూ.18,000 చెల్లించాలని డిమాండ్ చేశారు.

సిఐటియు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ, ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే పోరాటం ప్రారంభించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కుషాయిగూడ పిహెచ్‌సీకి చెందిన ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

- వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దు..
- వైరా ఏసీపీ రహేమాన్

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని వైరా ఏసీపీ రహేమన్ తెలిపారు. ప్రధానంగా వాగులు వంకలన్నీ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రోడ్లు జలమయమయ్యే ప్రాంతాలలో ప్రజలు రోడ్డు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. పిల్లలు ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా చేపాల వేటాకు వెళ్లవద్దని, పశువుల కాపర్లు చెరువులు, వాగులు దాటవద్దని పెర్కొన్నారు. యువకులు సెల్ఫీల కోసం నీటి ప్రవాహం వద్దకు వెళ్లవద్దని సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు, స్థానిక పోలీసులకు, పోలీస్ కంట్రోల్ సెల్ నెంబర్ 8712659111 సమాచారం అందించాలని సూచించారు.

వైరా డివిజన్ లో ఇప్పటికే చెరువులు, వాగుల వద్ద పెట్రోలింగ్ పెంచి ప్రమాద హెచ్చరికలను తెలియజేసేలా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. చెరువులు, కుంటల వద్ద నీటి ఉధృతిని దృష్టిలో ఉంచుకొని వంతెనలు, చప్టలపై బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాల భారీన పడకుండా వాహనాల రాకపోకలను నిషేధించాలని పోలీస్ అధికారులకు సూచించామని తెలిపారు. ఎగువ ప్రాంతంలో అధిక వర్షాల మూలంగా వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని, ఈ దష్ట్యా అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ – పేదలకు ఒక వరం

**ఎమ్మెల్యే బండారి,కార్పొరేటర్ బన్నాల**

**చిల్కానగర్, తెలంగాణ ముచ్చట్లు:**



చిల్కానగర్ డివిజన్‌లోని రాఘవేంద్ర నగర్ కాలనీలో అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా నివసిస్తున్న సుగుణమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె చికిత్స ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కును చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి సుగుణమ్మ ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా సుగుణమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, అవసరమైన సహాయ సహకారాల కోసం ఎప్పుడైనా తమను సంప్రదించాలని కార్పొరేటర్ ధైర్యం చెప్పింది. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, శ్యామ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

# ది హిందూ జి.ఎన్.రావుకు గోల్డ్ మెడల్

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



ఖమ్మం: ది హిందూ సీనియర్ ఫోటోగ్రాఫర్ జి ఎన్ రావుకు 186వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి వారి సౌజన్యంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రాఫిక్ కౌన్సిల్ ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీలో ఫోటో జర్నలిజం లో బెస్ట్ ఫోటోగ్రఫీలో గోల్డ్ మెడల్ తో పాటు క్యాష్ అవార్డ్ గెలుచుకున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుండి అనేకమంది ఫోటో జర్నలిస్టులు పోటీపడ్డారు. ఈ పోటీల్లో ఫోటో జర్నలిజం విభాగంలో ఫస్ట్ బెస్ట్ అవార్డును జిఎన్ ఆర్ ఏఠ సాధించారు. ఈ అవార్డును ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఈనెల 19న ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, జనసేన అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, మాజీ పార్లమెంటు సభ్యులు గోకరాజు గంగరాజు చేతుల మీదుగా ఈ అవార్డును విజయవాడలో అందుకోనున్నారు .ఈ సందర్భంగా తను ఎంపిక చేసిన ఫోటోగ్రఫీ కాంటెస్ట్ చైర్మన్ టి శ్రీనివాస్ రెడ్డికి జి ఎన్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

# చర్లపల్లి పారిశ్రామికవాడలో ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

- కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆసుపత్రి ఏర్పాటుకు కృషి
- ఎమ్మెల్యే లక్ష్మా రెడ్డి

**చర్లపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**






చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం, చర్లపల్లి ఐలా, లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డెన్ జూబ్లీ, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఇండస్ట్రియల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత మల్టీ వైద్యశిబిరానికి కార్మికులు, స్థానికులు విశేషంగా హాజరయ్యారు.

జీనియా ఆసుపత్రి, ఏసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, రెనోవా డీడీహెచ్ ఆసుపత్రి, ఎమ్.ఎస్. రెడ్డి లయన్స్ ఐ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు రెండు వేల మందికి జనరల్ చెకప్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, గుండె, కంటి, కిడ్నీ, క్యాన్సర్ స్క్రీనింగ్ సహా పలు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 350 మందికి కంటి పరీక్షలు చేసి, అందులో 200 మందికి కంటి అద్దాలు అందజేశారు.

శిబిరాన్ని ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యుడు బండారి లక్ష్మారెడ్డి, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చర్లపల్లి పారిశ్రామికవాడలో కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం వంద పడకల ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలో కార్మికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం అధ్యక్షుడు డి. శ్రీనివాస రెడ్డి, చర్లపల్లి ఐలా అధ్యక్షుడు కె. గోవిందరెడ్డి, మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి, మాజీ ఐలా అధ్యక్షుడు హరీష్ రెడ్డి, పి.ఎస్. మోహన్, రాఘవయ్య, గంగాధర్ బాబు, సుధాకర్ రెడ్డి, వైద్య సిబ్బంది, పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

**కాప్రా, తెలంగాణ ముచ్చట్లు:**




ఉప్పల్ నియోజకవర్గ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని సీపీఐ కార్యాలయం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌నుండి ప్రచార రథాన్ని రాష్ట్ర సమితి సభ్యుడు జీ. దామోదర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలు ఈ నెల 19 నుంచి 22 వరకు నాలుగు రోజులపాటు జరగనున్న నేపథ్యంలో, మహాసభల విజయవంతం కోసం ఈ ప్రచార రథం జిల్లా వ్యాప్తంగా పర్యటించనుంది.

మొదటి రోజు ఉప్పల్ నియోజకవర్గంలోని ఈసీఐఎల్, కుషాయిగూడ, చర్లపల్లి, ఏఎస్ రావు నగర్, హెచ్‌బీ కాలనీ, అశోక్ నగర్, మల్లాపూర్, నాచారం, హబ్సిగూడ, ఉప్పల్, రామంతపూర్, చిలుకానగర్ ప్రాంతాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా జీ. దామోదర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అన్ని వ్యవస్థలను తన ఆధీనంలోకి తీసుకొని పాలన సాగిస్తోందని విమర్శించారు. ఎన్నికల కమిషన్ పక్షపాత ధోరణి, ఓటర్ల జాబితాలో అక్రమాలు, ప్రతిపక్ష పార్టీలపై అన్యాయం వంటి అంశాలను ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని, రాష్ట్ర మహాసభల్లో అనేక తీర్మానాలు ఆమోదించి వాటి అమలు కోసం కృషి చేస్తామని తెలిపారు. సీపీఐ 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి. సత్య ప్రసాద్, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా, సాయిలు, కిరణ్, అలాగే ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు మహేష్, సుధీర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# 72 గంటలు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన

- కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, తెలంగాణ ముచ్చట్లు:**



రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వచ్చే 72 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం వార్డు కార్యాలయంలో జిహెచ్ఎంసీ, హైడ్రా, విద్యుత్, రెవెన్యూ సహా అనేక విభాగాల అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది విభాగాల వారీగా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

సమావేశంలో ఈఈ హరిలాల్ నాయక్, శానిటైజేషన్ డిఈ చందన, వాటర్ వర్క్స్ మేనేజర్ సత్యనారాయణ, ఏఈ రాజ్ కుమార్, హైడ్రా మార్షల్ వీరేందర్, ఎంటమాలజీ సూపర్వైజర్ మహేందర్, అజయ్, ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్, ఈగ ఆంజనేయులు ముదిరాజ్, బజారు జగన్నాథ గౌడ్, లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవి రెడ్డి, భాస్కర్ రెడ్డి, సుంకు శేఖర్ రెడ్డి, కుసంగుల సతీష్ ముదిరాజ్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జాటోత్ హుస్సేన్ నాయక్‌కు ఎస్సీ, ఎస్టీ సమస్యలపై వినతిపత్రం



**కాప్రా, తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ బట్టు రాజయ్య నాయక్ ఆధ్వర్యంలో జాతీయ ఎస్టీ కమిషన్ అధ్యక్షులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను హైదరాబాద్‌లోని దిల్‌కుష్ గెస్ట్ హౌస్‌లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేసి, వాటి పరిష్కారానికి రివ్యూ సమావేశం నిర్వహించాలని కోరారు.

జాటోత్ హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ, వినతిపత్రంలో ప్రస్తావించిన సమస్యలను త్వరలోనే సమీక్షించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాజయ్య నాయక్ మాట్లాడుతూ, టీఎస్ ఆర్టీసీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తమ దృష్టికి తీసుకువస్తే, పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గడ్డం తిరుపతి (కరీంనగర్ జోనల్ కన్వీనర్), బి.బి.సింగ్ (సికింద్రాబాద్ రీజినల్ కార్యదర్శి), సూర్య నాయక్, నరేందర్, భాగ్య నాయక్, కొమురయ్య, రాజారపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిముల పాత్ర

- చరిత్ర మరిచిన యోధులు వీరు

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**





-ముహమ్మద్ ముజాహిద్,
9640622076

భారత దేశ చరిత్రలో మహోజ్వల ఘట్టమైన స్వాతంత్ర్యోద్యమం భారతీయుల పోరాట పటిమకు, త్యాగ నిరతికి ఒక నిలువుటద్దం. ఇలాంటి పోరాటంలో దేశంలోని అతి పెద్ద అల్ప సంఖ్యాక వర్గమైన ముస్లింలు తమదైన బాధ్యతాయుత పాత్రను పోషించారు. అపూర్వ త్యాగాలతో పునీతులయ్యారు. అయినా వారి త్యాగమయ చరిత్ర పలు కారణాల వల్ల మరుగున పడిపోయింది. కానీ చరిత్రను నిశితంగా పరిశీలిస్తే భారత స్వాతంత్ర్య సాధనకు ముస్లింలు చేసిన కృషి ఎంత అమూల్యమైనదో తెలుస్తుంది. కొందరు చరిత్రకారులు, రచయితలు ఈ విషయంలో కృషి చేసి ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల గురించి ప్రపంచానికి తెలియజేశారు.

బ్రిటిషర్ల దురాగతాలను అడ్డుకున్న మొదటి మొనగాడిగా బెంగాల్ నవాబ్ సిరాజుద్దౌల ప్రఖ్యాతి గాంచాడు. ప్రథమ స్వాతంత్ర్య సమరానికి ముందే బ్రిటీష్ పాలకులకు తొత్తులైన బెంగాల్ జమీందార్లకు వ్యతిరేకంగా 1763లో ముస్లిం ఫకీర్లు మజ్నూషా నేతృత్వంలో తిరుగుబాటు చేశారు. ఇది ఫకీర్లుసన్యాసుల ఉద్యమంగా ఖ్యాతి గాంచింది. 18201870 మధ్య ముస్లిం నాయకుల నేతృత్వంలో వహాబీ ఉద్యమం జరిగింది. ఆ తర్వాత టిప్పు సుల్తాన్ బ్రిటిషర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. కానీ స్వదేశీ పాలకులు ఆయనతో కలిసి రాలేదు. ''స్వదేశీ పాలకులు టిప్పు మాటను గౌరవించి ఉంటే ఈనాడు ఈ నేల మీద మేం పాలకులుగా ఉండేవాళ్లం కాదు'' అని బ్రిటిష్ పాలకులు ప్రకటించారంటే టిప్పు ఎంత గట్టిగా బ్రిటిష్ పాలకులను ఎదిరించాడో అర్థమవుతుంది. ఆ తర్వాత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా ప్రసిద్ధి చెందిన 1857 తిరుగుబాటు కూడా ముస్లిం పాలకుడైన మొఘల్ పాదుషా బహద్దూర్ షా జాఫర్ నాయకత్వంలో జరగడం మనార్హం. ఈ ఉద్యమంలో విక్టోరియా మహారాణి ప్రకటనకు దీటుగా అవధ్‌కు చెందిన బేగం హజరత్ మహల్ భారతీయులను హెచ్చరిస్తూ ఒక ప్రకటన చేశారు. ఆత్మ గౌరవంతో, ధర్మబద్ధంగా ప్రశాంత జీవితం సాగించాలంటే స్వదేశీ పాలన కోసం శత్రువులకు వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టండని ఆమె పిలుపునిచ్చారు. ప్రజల్లో దేశభక్తి భావన పెంపొందించేందుకు పయామే ఆజాది పత్రికను అజీముల్లా ఖాన్ హిందీ, ఉర్దూ భాషల్లో ప్రచురించారు.

ఆనాడు బ్రిటీష్ పాలకులను అడుగడుగునా ఎదిరించిన యోధుల్లో మౌలానా లియాఖత్ అలీ ఖాన్, హిక్మతుల్లా ఖాన్, ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుల సేనాని మహమ్మద్ భక్త్ ఖాన్, షెహజాదా ఫిరోజ్ షా, ఝాన్సీ రాణిని తిరుగుబాటుకు పురి కొల్పిన బక్షీస్ అలీ ప్రధాన పాత్ర పోషించారు. ఆనాటి పోరులో హిందూముస్లింల ఐక్యతకు ప్రతీకగా ఖాన్ బహద్దూర్ ఖాన్ నిలిచారు.

ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో ముస్లిం మహిళలు కూడా అసంఖ్యాకంగా పాల్గొన్నారు. ఇందులో మహిళా సైనిక దళాలు ఏర్పాటు చేసి, నానా సాహెబ్ పక్షాన రణరంగంలో వీర విహారం చేసిన పాతికేళ్ల యువతి అజీజున్ మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచారు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో 27 వేల మంది ముస్లిం స్త్రీ, పురుషులను బ్రిటిష్ సైన్యాలు ఉరి తీశాయి, తగుల బెట్టాయి. మరో 30 వేల మందిని ప్రవాస శిక్షలకు గురి చేశాయి. నాటి సంగ్రామాన్ని ఆంగ్లేయాధికారి హెన్నీ మీడ్ ఇస్లామిక్ తిరుగుబాటుగా అభివర్ణించడాన్ని బట్టి ఆనాడు పోరాటంలో ముస్లింలు ఎంతో వీరోచితంగా పోరాడారో మనకు అర్థమవుతుంది.

బ్రిటిష్ పాలకులపై తిరుగుబాటు చేసిన వారిలో తెలంగాణకు ఎందిన పఠాన్ తుర్రే బాజ్ ఖాన్ ముఖ్యులు. 1857లో ఆయన హైదరాబాద్‌లోని బ్రిటిష్ రెసిడెన్సీపై దాడి చేశారు. దీంతో ఆయనపై ప్రతీకారం పెంచుకున్న బ్రిటిష్ పాలకులు అతి కష్టం మీద ఆయనను బంధించి హైదరాబాద్ నడిబొడ్డున ఆయనను ఉరి తీశారు. మరోవైపు విశాఖపట్నం బ్రిటిష్ సైన్యంలో సైనికాధికారిగా పని చేసిన సుబేదార్ అహమ్మద్ కూడా ఆనాటి తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. ఆయనను కూడా బ్రిటిష్ అధికారులు ఫిరంగి రంధ్రానికి కట్టి పేల్చేశారు. ఆ తర్వాత భారత జాతీయ కాంగ్రెస్ తొలి రోజుల్లో బద్రుద్దీన్ తయ్యాబ్జీ, రహమతుల్లా సయాని లాంటి ప్రముఖులు కాంగ్రెస్ అధ్యక్ష పీఠాన్ని అధిరోహించి స్వాతంత్ర్య సమరంలో చురుగ్గా పాల్గొన్నారు. బ్రిటిష్ పాలకులు హిందూముస్లింల మధ్య విభజన తెచ్చి పబ్బం గడుపుకోవాలని ప్రయత్నించినప్పుడు జాతీయోద్యమంలో పాల్గొనడం ముస్లింల విధిగా పేర్కొంటూ ఉలెమాలు కొందరు విస్తృతంగా ఫత్వాలు జారీ చేశారు. నమాజ్ చేయడం ఎంతటి విధో.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడటం కూడా అంతే తప్పనిసరి విధిగా మౌలానా ముహమ్మద్ లాంటి వారు పేర్కొన్నారు.

విప్లవ గ్రూపులు బ్రిటిష్ ప్రభుత్వంపై పోరాడిన అగ్ని యుగంగా పిలువబడే కాలంలో గదర్ పార్టీలో డాక్టర్ బర్కతుల్లా, డాక్టర్ మన్సూర్, అబ్దుల్ వహాబ్ ప్రధాన పాత్ర పోషించారు. ఆనాడు భారతీయ సైనికుల్లో తిరుగుబాటును ప్రోత్సహిస్తూ గాలిబ్ పాషా లేఖలు రాశారు. ఆ తర్వాత మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించారు. రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా డాక్టర్ సైపుద్దీన్ కిచ్లూ లాంటి నాయకులు పోరాడారు. వారికి బ్రిటిష్ ప్రభుత్వం విధించిన శిక్షకు నిరసనగా జరిగిన జలియన్‌వాలాబాగ్ లో ప్రజలు సమావేశమయ్యారు. ఆ సమావేశంలో బ్రిటిష్ అధికారులు జరిపిన కాల్పుల్లో 55 మంది ముస్లింలు మరణించారు.

తన దేశంలోని కుక్క పిల్లలు కూడా బ్రిటిష్ బానిస సంకెళ్లలో బందీలుగా ఉండరాదన్నది తన అభిమతమని ఆబాది బేగం బానో గర్జించారు. జాతీయోద్యమంలో చిచ్చరి పిడుగుగా ప్రసిద్ధుడైన హసరత్ మెహాని 1921 నాటి కాంగ్రెస్ సమావేశంలో సంపూర్ణ స్వరాజ్యం ప్రతిపాదన ప్రవేశపెట్టారు. మలబార్లో మోప్లాల తిరుగుబాటుకు మౌలీ అలీ ముస్సలియార్ నేతృత్వం వహించారు. అష్ఫాఖుల్లా ఖాన్ లాంటి యువకులు హిందూస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ లాంటి విప్లవ సంస్థల్లో సభ్యులై బ్రిటిషర్లపై సాయుధ పోరాటం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటానికి డిప్యూటీ కలెక్టర్ ఫజులుల్లా ఖాన్ ప్రేరణగా నిలిచారు.

1927లో సైమన్ కమిటీ గో బ్యాక్ అంటూ ముంబై లో జరిగిన భారీ ప్రదర్శనకు యువ నాయకుడు యూసుఫ్ మెహరాలి నాయకత్వం వహించారు. చిట్టగాంగ్ విప్లవ వీరులకు ముస్లిం యువకులు రక్షణగా ఉంటూ గమ్య స్థానాలకు చేర్చేవారు. 1930లో జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో సరిహద్దు గాంధీగా ప్రసిద్ధులైన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ తన సోదరుడితో కలిసి అహింసా యోధుల దళాన్ని (రెడ్ షర్ట్స్) ఏర్పాటు చేసి స్వాతంత్ర్యం కోసం పోరాడారు. దేశ స్వాతంత్ర్య పోరాటానికి చివర్లో ఊపిరులూదిన క్విట్ ఇండియా ఉద్యమానికి నినాదం అందించిన ఘనత యూసుఫ్ మెహర్ అలీకి దక్కుతుంది. ఇక నేతాజీ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్‌లో జనరల్‌గా షానవాజ్, కల్నల్ గా అజీజ్ అహ్మద్, యం.కె.ఖైనీ ప్రధాన బాధ్యత నిర్వహించారు. 1946 ఫిబ్రవరిలో జరిగిన రాయల్ ఇండియన్ నేవీ తిరుగుబాటులో పాల్గొని బ్రిటిష్ ప్రభుత్వ కాల్పుల్లో మరణించినవారిలో అత్యధికులు ముస్లింలే. 1940 నుంచి 1947లో స్వాతంత్ర్యం వచ్చే వరకు గాంధీజీ, మౌలానా ఆజాద్ ఇద్దరూ జాతీయోద్యమానికి మార్గదర్శకత్వం వహించారని చెప్పవచ్చు. జాతీయవాద ముస్లిం నాయకులు దేశ విభజనను కూడా వ్యతిరేకించారు. ఈ విధంగా భారతీయ ముస్లింలు దేశ స్వాతంత్ర్య పోరాటం కీలక పాత్ర పోషించారు. ఇన్నిన్ని త్యాగాలు చేసిన ముస్లిమ్ యోధులను చరిత్ర పుస్తకాల్లో మాత్రం సముచితమైన స్థానం దక్కలేదు.

# మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి

- ఖమ్మం జిల్లా అధ్యక్షుడుగా యలమందుల జగదీష్..
- ఏకగ్రీవంగా ఎన్నికైన జగదీష్ ను అభినంధించిన...
- రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు నరాల రుక్మారావు, రఫీ

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**





తెలంగాణ రాష్ట్ర మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడుగా యలమందల జగదీష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆ సంఘం ఫౌండర్ శికిలంభట్ల యాదగిరి, రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు నరాల రుక్మారావు, రఫీ లు పేర్కొన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని రెడ్డిగూడెం మారెమ్మతల్లి గుడివద్ద బుధవారం తెలంగాణ రాష్ట్ర మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘ ఫౌండర్ శికిలంభట్ల యాదగిరి, రాష్ట్ర అధ్యక్షులు నరాల రుక్మారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ... అసోసియేషన్ లో సీనియర్ గా నిబద్ధత కలిగి పనిచేస్తున్న ఖమ్మం జిల్లా కైకొండాయిగూడెం గ్రామానికి చెందిన యలమందల జగదీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన జగదీష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మ్యారేజ్ బ్యూరోల మీడియేటర్ ల సమస్యల పరిష్కారం కోసం, అదేవిదంగా సంఘం బలోపేతం కోసం నిరంతరం పనిచేస్తానని, ఎక్కడో ఉన్న అమ్మాయిని, మరెక్కడో ఉన్న అబ్బాయిని కలిపి వివాహం చేయడం అది ఎంతో పుణ్యకార్యమని అన్నారు. సమాజంలో 26ఏళ్లుగా అనుభవమున్న తనను అధ్యక్షునిగా, మహ్మద్ ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ పెద్దలు తన మీద పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంఘం అభివృద్ధికి తోడ్పడతానని, ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ముందుంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, బాబు, వెంకటనారాయణ, చంద్రకళ, సంధ్యారాణి, కర్నాటి నాగమణి, నాగలక్ష్మి, వెంకటలక్ష్మీ, అనూష తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దు
- అత్యవసర సమయాల్లో డయల్ 100, 1077
- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. బుధవారం నగరంలోని కాల్వవోడ్డు మున్నేరు, ప్రకాష్‌నగర్ మున్నేరు ప్రాంతాలను మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలసి పోలీస్ కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. వాగులు వంకలన్నీ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రోడ్లు జలమయమయ్యే ప్రాంతాలలో ప్రజలెవరు రోడ్డు దాటే ప్రయత్నం చేయవద్దని విజ్ఞప్తి చేశారు.మరో మూడు రోజులు ఇదే పరిస్థితులు వుండే అవకాశం ఉంటుంది కాబట్టి వాహనదారులు వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని, పిల్లలు ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా చేపాల వేటాకు వెళ్లవద్దని, పశువుల కాపర్లు చెరువులు, వాగులు దాటవద్దని పెర్కొన్నారు. యువకులు సెల్ఫీల కోసం నీటి ప్రవాహం వద్దకు వెళ్లవద్దని సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు, స్థానిక పోలీసులకు, పోలీస్ కంట్రోల్ సెల్ నెంబర్ 8712659111, కలెక్టర్ ఆఫీస్ టోల్ ఫ్రీ నెంబర్ 1077, సెల్ నెంబరు 9063211298 సమాచారం ఆందిచాలని సూచించారు. ఇప్పటికే చెరువులు, వాగుల వద్ద పోలీస్ పెట్రోలింగ్ పెంచి ప్రమాద హెచ్చరికలను తెలియజేసేలా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. చెరువులు, కుంటల వద్ద నీటి ఉధృతిని దృష్టిలో ఉంచుకొని వంతెనలు, చప్టలపై బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాల భారీన పడకుండా వాహనాల రాకపోకలను నిషేధించాలని పోలీస్ అధికారులకు సూచించామని తెలిపారు.

ఎగువ ప్రాంతంలో అధిక వర్షాల మూలంగా వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని, ఈ దష్ట్యా అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. ప్రజలు కూడా అపప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ రమణమూర్తి, ఇన్స్పెక్టర్ మోహన్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి ...

- వ్యవసాయ అధికారికి వినతి చేసిన టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాణాల...

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



వైరా మండలంలో యూరియా కొరత లేకుండా తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైరా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు మండల వ్యవసాయ అధికారి కాసింకు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైరా మండలంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని పలు గ్రామాల్లో రైతులు యూరియా కోసం సొసైటీల వద్ద పడి కాపులు కాస్తున్నారని తక్షణమే యూరియా కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు గత ప్రభుత్వంలో యూరియా కొరత లేదని ఈ ప్రభుత్వంలో యూరియా కొరత నెలకొనటానికి కారణాలు ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే యూరియా కొరత తీర్చకపోతే క్షేత్రస్థాయిలో రైతుల పక్షాన పోరాటాలు తప్పవని బాణాల అన్నారు.







# విజబుల్ పోలిసింగ్ తో నేరాల నియంత్రణ.... క్షేత్రస్థాయిలో రాత్రి గస్తీపై దృష్టి

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్..

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**




నేరాల నియంత్రణ,చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు పోలీస్ యంత్రాంగం పోలీస్ కమిషనరేట్ పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. విజబుల్ పోలీసింగ్ పటిష్టంగా అమలు చేస్తేనే నేరాలు, దొంగతనాలు నియంత్రణలో వుంటాయన్న నేపథ్యంలో అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో గత వారం రోజులుగా పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీస్ గస్తీ పెంచి, పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. సుమారు 50 హోటళ్ళు, లాడ్జీలపై పోలీసులు సోదాలు నిర్వహించి అనుమానిత వ్యక్తుల పూర్తి వివరాలను సేకరించి, అనంతరం వారికి వెసులుబాటు కల్పిస్తున్నారు. గంజాయి సరఫరా, వినియోగాన్ని సమూలంగా నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కట్టడిలో పురోగతి సాధించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా సరిహద్దు రాష్ట్రాల మీదుగా గంజాయి , రేషన్ బియ్యం, ఇసుక వంటి అక్రమ రవాణా,పాత నేరస్తుల కదలికలను కట్టడి చేసేలా జిల్లా పోలీస్ యంత్రాంగం వాహన తనిఖీలు ముమ్మరం చేస్తున్నారని తెలిపారు. సేఫ్టీ అండ్ సెక్యూరిటీ దృష్టిలో పెట్టుకొని సీసి కెమెరాల ఏర్పాటుకు స్థానిక ప్రజలు స్వచ్ఛద్ధంగా ముందుకు రావాలని,వ్యాపారస్తులు ఖచ్చితంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా.!

- ఇందిరమ్మ ఇల్లు పేరుతో అక్రమంగా ఇసుక దందా.
- లారీని సీజ్ చేసిన దమ్మపేట పోలీసులు.
- కోట్ల రూపాయలు దండుకుంటున్న దళారులు.

**దమ్మపేట, తెలంగాణ ముచ్చట్లు:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలంలో ఆంధ్రా నుంచి విచ్చలవిడిగా ప్రతిరోజు పదుల సంఖ్యలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇందిరమ్మ ఇల్లు పేరుతో అక్రమంగా ఇసుకను భారీ వాహనాలలో తీసుకువస్తూ దళారులు జేబులు నింపుకుంటున్నారు.

ప్రతి రోజు యధా విధిగా ఏలాంటి అనుమతులు లేకుండా దమ్మపేట మండల పరిధిలోకి వచ్చిన ఇసుక లారీని విశ్వసనీయమైన సమాచారంతో దమ్మపేట పోలీసులు లారీని పట్టు కొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. దమ్మపేట సబ్ ఇన్స్పెక్టర్ సాయి కిషోర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎవరైనా అనుమతులు లేకుండా చట్టవిరుద్ధమైన పనులు చేస్తే ఎంతటి వారికైనా కఠిన చర్యలు తప్పవని సాయి కిషోర్ రెడ్డి హెచ్చరించారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే పరిసర ప్రాంతాల వారు, పోలీసు అధికారులకు తెలియపరచాలని కోరారు. అలాగే ఇందిరమ్మ ఇల్లు పేరు చెప్పి ఇలాంటివి చర్యలకు పాల్పడితే కఠినమైన శిక్షలు తప్పవని అన్నారు.

# విశిష్ట సేవరత్న అవార్డు అందుకున్న నీలం శివగంగాధర

- 15 ఏళ్ల నిరంతర సేవకు గుర్తింపుగా అవార్డు ప్రదానం

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

ఓం నమశ్శివాయ సేవా కళా సమితి నిర్వాహకుడు నీలం శివగంగాధర విశిష్ట సేవరత్న అవార్డును అందుకున్నారు. వరల్డ్ మ్యూజిక్ బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ తమన్ బహులాల్ శుక్రవారం సాయంత్రం హర హర కళా భవన్‌లో ఆయనకు అవార్డు ప్రదానం చేశారు.

తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన 40 మంది అవార్డు గ్రహీతల్లో శివగంగాధర ఒకరని బహులాల్ తెలిపారు. ఏ ఒక్కరు రాత్రికి రాత్రే గుర్తింపు పొందరని, 15 సంవత్సరాలుగా ఆయన చేస్తున్న సేవలకు ఈ అవార్డు వరించిందని పేర్కొన్నారు. సామాజిక చైతన్యానికి ప్రతి పౌరుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రముఖ న్యాయవాది డాక్టర్ సునీల్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ, ఔన్నత్యాన్ని చాటి చెప్పేది కీర్తి పతకాలు కాదని, ఆచరణలో చూపే సేవ అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా శివగంగాధర మాట్లాడుతూ, ఇంతటి ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# బీమాను అందరికీ చేర్చడమే లక్ష్యం

దేశంలో ప్రతీ ఒక్కరికీ జీవిత బీమాను చేర్చాలని నిర్దేశించుకున్నామని ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) ఎండీ, సీఈఓ ఆర్ దొరైస్వామి తెలిపారు. 2047 నాటికి అందరికీ బీమా లక్ష్యంగా పెట్టుకున్నామని మంగళవారం ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దొరైస్వామి తెలిపారు. సెప్టెంబర్‌తో ముగియనున్న రెండో త్రైమాసికంలో పాలసీల విక్రయాల్లో మరింత వృద్ధి నమోదు కానుందన్నారు. ప్రస్తుత 202526 ఆర్థిక సంవత్సరం ప్రీమియంలో రెండంకెల వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టడం, నాన్‌పార్టిసిపేటింగ్ ఉత్పత్తులపై దృష్టి సారించడం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించనున్నామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 2025 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసి పాలసీ అమ్మకాల ప్రీమియం 9.45 శాతం వద్ధితో రూ.54,238 కోట్లకు చేరింది. ఇది 202425లో రూ.49,543 కోట్లుగా ఉంది. 2026 జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో కొత్త బిజినెస్ ప్రీమియం (ఎన్‌సీపీ)19.78 శాతం పెరిగి రూ.11,337 కోట్లకు చేరింది. 2026 మార్చి నాటికి ఐదారు కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టాలని ఎల్ఐసీ లక్ష్యంగా పెట్టుకుంది. అదే విధంగా కృత్రిమ మేధా (ఏఐ)ను పాలసీ సేవలు, క్లెయిమ్ ప్రాసెసింగ్‌లో ఉపయోగించుకోవాలని ఎల్ఐసి యోచిస్తోంది. గడిచిన జూన్ త్రైమాసికంలో ఎల్ఐసీ నికర లాభాలు 9.61 శాతం పెరిగి రూ.10,461 కోట్లుగా చోటు చేసుకుంది. మొత్తం ప్రీమియం ఆదాయం 15.27 శాతం వృద్ధితో రూ.1.14 లక్షల కోట్లకు చేరింది.





# స్థానిక సంస్థల ఎన్నికల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి..

**◆తల్లాడ మండలంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్..**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే ధ్యేయంగా కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సూచించారు. బుధవారం తల్లాడ మండలంలోని రంగం బంజార, మన్సూర్ తండా, నూతన కల్లు ,గూడూరు, బిల్లుపాడు అన్నారుగూడెం, బాలపేట మల్లారం తల్లాడ పినపాక కుర్రవల్లి తదితర గ్రామాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఈసారి పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని నినాదాలు చేయడంతో ఆ దిశగా కార్యకర్తలు పనిచేయాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ మారెళ్ళ మమత, మల్లికార్జున్ దంపతులతో ఆమె కొద్దిసేపు మాట్లాడారు. గ్రామంలో నెలకొని ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని తుమ్మలపల్లి రమేష్, ఆపతి రామయ్య వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాపా సుధాకర్, దగ్గుల రఘుపతి రెడ్డి, సీనియర్ నాయకులు దీవెల కృష్ణయ్య,జిల్లా కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు కటిక కిరణ్,మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు అడపా అనిల్ చౌదరి, రాయల రాము,గంగదేవిపాడు సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు, దుగ్గినేని గోపయ్య, గుర్రం శ్రీనివాసరావు, జక్కంపూడి కిషోర్, కేతేపల్లి భాస్కరరావు, బొడ్డు వెంకటేశ్వరరావు, పగడాల లచ్చిరెడ్డి, బాలశౌరి,భూక్యా అంజయ్య, యూత్ మండల ఉపాధ్యక్షుడు వారాల అజయ్,గుజ్జులా పూడి చింటూ, ఎక్కిరాల నాగేశ్వరరావు,తల్లాడ సోషల్ మీడియా ఇంచార్జ్ ఎస్కే జమాల్,తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంక్ స్టాక్స్‌లో అమ్మకాలు.. 24,500 దిగువకు నిఫ్టీ




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొని ఆఖరికి నష్టాల్లో ముగిశాయి. ఫైనాన్షియల్, ఎఫ్ఎంసీజీ, రియల్టీ షేర్లలో అమ్మకాలు సూచీలపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి.జులై నెలకు సంబంధించి భారత్, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు వెలువడనుండడంతో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. ఈ గణాంకాలు వడ్డీ రేట్ల అంశాన్ని ప్రభావితం చేయనున్నాయి. దీనికితోడు అమెరికా రష్యా మధ్య ఆగస్టు 15న జరగనున్న చర్చలపైనా మదుపర్లు దృష్టి సారించారు. ఉక్రెయిన్ యుద్ధంపై ఇరువురు దేశాధినేతల భేటీలో ఎలాంటి నిర్ణయం వెలువడనుందనే దానిపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. సెన్సెక్స్ ఉదయం 80,508.51 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,604.08) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే లాభాల్లోకి వచ్చిన సూచీ.. 80,997.67 వద్ద గరిష్ఠాన్ని తాకింది. కాసేపటికే మళ్లీ నష్టాల్లోకి జారుకుంది. మధ్యాహ్నమంతా ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీ.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడితో 368.49 పాయింట్ల నష్టంతో 80,235.59 వద్ద ముగిసింది. నిఫ్టీ 97.65 పాయింట్ల నష్టంతో 24,487.40 పాయింట్ల వద్ద స్థిరపడిరది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.71గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, హిందుస్థాన్ యూనిలీవర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎటెర్నల్ షేర్లు ప్రధానంగా నష్టోయాయి. మారుతీ సుజుకీ, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్టీపీసీ, టాటా స్టీల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా..బంగారం ఔన్సు 3,349 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



# ‘గూగుల్ పిక్సెల్ 8ఎ’పై భారీ ఆఫర్

కొత్త స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది నిజంగా శుభవార్త. ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్ నుంచి వచ్చిన తాజా మోడల్ పిక్సెల్ 8ఎ ఇప్పుడు ఆకర్షణీయమైన ధరకు లభిస్తోంది. ఫ్లిప్‌కార్ట్ ప్రకటించిన ఈ ఆఫర్‌తో, మార్కెట్లో అత్యుత్తమ ఫీచర్లతో ఉన్న ఈ స్మార్ట్‌ఫోన్‌ను ఊహించని తక్కువ ధరకే సొంతం చేసుకోవచ్చు. సాధారణంగా గూగుల్ పిక్సెల్ 8ఎ (128Gబీ వేరియంట్) మార్కెట్లో ధర రూ. 52,999. అయితే, ఫ్లిప్‌కార్ట్ ప్రస్తుతం ఏకంగా రూ. 15,000 ఫ్లాట్ డిస్కౌంట్ అందిస్తోంది. దీంతో ఈ ఫోన్ ధర రూ. 37,999కు తగ్గింది. ఫ్లిప్‌కార్ట్ ఆఫర్‌కు తోడు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డు ఈఎంఐ లావాదేవీల ద్వారా కొనుగోలు చేసే కస్టమర్లకు మరొక రూ. 7,000 తగ్గింపు లభిస్తుంది. ఈ రెండు ఆఫర్లను కలిపితే, పిక్సెల్ 8ఎ ధర కేవలం రూ. 30,999కు చేరింది. కొనుగోలుదారుల సౌలభ్యం కోసం ఫ్లిప్‌కార్ట్, ఎంపిక చేసిన బ్యాంక్ క్రెడిట్ కార్డులపై ఆరు నెలల నోకాస్ట్ ఈఎంఐ సదుపాయం అందిస్తోంది. దీని ద్వారా కస్టమర్లు వడ్డీ లేకుండా సులభంగా చెల్లింపులు చేయవచ్చు. మీ పాత స్మార్ట్‌ఫోన్‌ను ఎక్స్‌చేంజ్ చేయడం ద్వారా, గరిష్టంగా రూ. 33,000 వరకు అదనపు తగ్గింపు పొందవచ్చు. ఈ విలువ మీ పాత ఫోన్ బ్రాండ్, మోడల్, కండిషన్‌పై ఆధారపడి ఉంటుంది. పాత ఫోన్ మంచి కండిషన్‌లో ఉంటే, కొత్త పిక్సెల్ 8ఎను మరింత తక్కువ ధరకు సొంతం చేసుకోవచ్చు.గూగుల్ పిక్సెల్ 8ఎ స్మార్ట్‌ఫోన్ అద్భుతమైన ఫీచర్లతో వినియోగదారులను ఆకట్టుకుంటోంది. ఈ ఫోన్‌లో 6.1 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లే, 120 హెచ్‌జడ్ రిఫ్రెష్ రేట్, 2,000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉన్నాయి. డిస్‌ప్లే రక్షణ కోసం కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 3ని ఉపయోగించారు. గూగుల్ సొంత టెన్సర్ జీ3 చిప్‌సెట్‌తో పనిచేసే ఈ ఫోన్‌లో 8 జీబీ ర్యామ్, 128, 256 జీబీ స్టోరేజ్ ఆప్షన్లు ఉన్నాయి.గూగుల్ పిక్సెల్ ఫోన్లంటేనే కెమెరాలకు పెట్టింది పేరు. దీనికి తగ్గట్టుగానే, ఈ ఫోన్‌లో 64 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరా, 13 మెగాపిక్సెల్ అల్ట్రావైడ్ లెన్స్‌తో కూడిన డ్యూయల్ రియర్ కెమెరా సెటప్ ఉంది.

# గూగుల్ ‘క్రోమ్ బ్రౌజర్’ కొనేందుకు భారీ ఆఫర్ ఇచ్చిన పర్‌ప్లెక్సిటీ ఏఐ




ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్ పర్‌ప్లెక్సిటీ ఏఐ బ్రౌజింగ్ దిగ్గజం గూగుల్‌కు చెందిన క్రోమ్‌ను కొనేందుకు భారీ ఆఫర్ చేసింది.క్రోమ్ బ్రౌజర్ కోసం ఏఐ కంపెనీ ఏకంగా 34.5 బిలియన్ డాలర్ల(మన కరెన్సీలో రూ. 3.02 లక్షల కోట్లు) బిడ్‌ను దాఖలు చేసిందని ది వాల్ స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్ వంటి పత్రికలు మంగళవారం ధృవీకరించాయి. అయితే, ఈ మొత్తం పర్‌ప్లెక్సిటీ ప్రస్తుత విలువ కంటే చాలా ఎక్కువ. కానీ చాలామంది పెట్టుబడిదారులు ఈ ఒప్పందానికి మద్దతు ఇవ్వడానికి అంగీకరించారని కంపెనీ తెలిపింది.ఈ ఏడాది జూలైలో పర్‌ప్లెక్సిటీ విలువను 18 బిలియన్ డాలర్లుగా నిర్ణయించారు. పర్‌ప్లెక్సిటీ కంపెనీ ఏఐఆధారిత సెర్చ్ ఇంజిన్‌కు ప్రసిద్ధి చెందింది. ఇది యూజర్లు అడిగే ఎలాంటి ప్రశ్నలకైనా సరళంగ సమాధానాలను ఇవ్వడంతో పాటు వెబ్‌లోని అసలు సోర్స్ మెటీరియల్‌కు లింక్‌లను అందిస్తుంది. గత నెలలోనే ఈ కంపెనీ కామెట్ అనే తన స్వంత ఏఐఆధారిత బ్రౌజర్‌ను ప్రారంభించింది. అయితే, ఈ స్టార్టప్ జనరేటివ్ ఏఐలో ఆధిపత్యం కోసం పోరాడుతోంది. మెటా,ఓపెన్‌ఏఐ లాంటి కంపెనీలు స్కిల్స్ ఉన్న ఇంజనీర్లకు భారీ జీతాలు, బోనస్‌లను ఇచ్చి మరీ కొత్త టెక్నాలజీపై పనిచేస్తున్నాయి. ఈ మెగా టెక్ కంపెనీలు ఏఐ మౌలిక సదుపాయాలపై ఏటా 10 బిలియన్ల డాలర్లను ఖర్చు చేస్తున్నాయి. గతేడాది నుంచి గూగుల్‌పై కొనసాగుతున్న యాంటీట్రస్ట్ తనిఖీల నేపథ్యంలో క్రోమ్‌ను విక్రయించాలని యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్(డీఓజే) ప్రతిపాదించిన సంగతి తెలిసిందే.

# ఇండిగోకు డీజీసీఏ షోకాజ్ నోటీసులు




విమానాల్లో భద్రత, సిబ్బంది వ్యవహారాలపై కఠినంగా వ్యవహరిస్తున్న డైరెక్టరైట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) అందులో భాగంగా ఇండిగోకు తాజా షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దాదాపు 1,700 మంది పైలట్లకు నిర్వహించిన సిమ్యులేటర్ శిక్షణలో లోపాలున్నాయని ఆరోపిస్తూ ఏవియేషన్ రెగ్యులేటర్ ఇండిగోకు ఈ నోటీసులు ఇచ్చింది. గత నెలలో ఎయిర్‌లైన్ సంస్థ నుంచి వచ్చిన రికార్డులు, నివేదికలను పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్టు మంగళవారం డీజీసీఏ అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి ఇండిగో నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. కమాండ్, ఫస్ట్ ఆఫీసర్ పైలట్‌లతో సహా దాదాపు 1,700 మంది పైలట్‌లకు కేటగిరీ సీ లేదా క్రిటికల్ ఎయిర్‌ఫీల్డ్ శిక్షణ అర్హత లేని సిమ్యులేటర్లతో నిర్వహించారని డీజీసీఏ కనుగొంది. పైలట్‌లు శిక్షణ పొందిన కాలికట్, లేహ్, ఖాట్మండు వంటి కొన్ని విమానాశ్రయాలలోని సిమ్యులేటర్లు కార్యకలాపాలకు అర్హత లేనివని కూడా డీజీసీఏ గుర్తించింది. టేబుల్ టాప్ రన్‌వే ఉన్న కాలికట్ లాంటి కొన్ని విమానాశ్రయాలు విమాన కార్యకలాపాల నిర్వహణకు అదనపు అవసరాలు కావాల్సి ఉందని పేర్కొంది.

# 4 శాతం తగ్గిన ప్రత్యక్ష పన్ను వసూళ్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 3.95 శాతం తగ్గి రూ.6.64 లక్షల కోట్లకు చేరుకున్నాయని మంగళవారం విడుదల చేసిన ప్రభుత్వ గణాంకాలు వెల్లడిరచాయి.గత ఆర్థిక సంవత్సరం (202425) ఇదే కాలంలో సేకరించిన రూ.6.91 లక్షల కోట్ల వసూళ్లు జరిగాయి. అధిక రీఫండ్‌ల కారణంగానే వసూళ్లలో క్షీణత నమోదైందని ప్రభుత్వం తెలిపింది. మొత్తం వసూళ్లలో నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు దాదాపు రూ.2.29 లక్షల కోట్లు కాగా, కార్పొరేట్ యేతర పన్ను వసూళ్లు రూ.4.12 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 11 మధ్య సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) వసూళ్లు రూ.22,362 కోట్లు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు జారీ చేసిన వాపసులు 10 శాతం పెరిగి రూ.1.35 లక్షల కోట్లకు చేరుకున్నాయి. సమీక్షించిన కాలంలో స్థూల వసూళ్లు (రీఫండ్‌లకు ముందు) రూ.7.99 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇది గత సంవత్సరం ఇదే కాలంలో వచ్చిన రూ.8.14 లక్షల కోట్ల కంటే 1.87 శాతం తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025 26) ప్రభుత్వం ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.25.20 లక్షల కోట్లు వస్తాయని అంచనా వేసింది, ఈ మొత్తం క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 12.7 శాతం ఎక్కువ. ఇదే సమయంలో ఎస్‌టీటీల నుంచి రూ.78,000 కోట్లు వసూలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



# చైనాపై సుంకాలకు ట్రంప్ వెనకడుగు



భారత్‌పై అధిక టారిఫ్‌లను అమలు చేయడంలో అమెరికా దూకుడుగా వ్యవహారిస్తోన్న వేళ.. మన పొరుగుదేశం చైనాతో మాత్రం తలొగ్గుతోనే ఉంది. తాజాగా చైనాతో వాణిజ్య ఒప్పందానికి మరో 90 రోజుల విరామం ప్రకటిస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. రష్యా చమురు కొనుగోలును కారణంగా చూపి భారత్‌పై ట్రంప్ ఇటీవల భారీస్థాయిలో 50 శాతం సుంకాలు విధించారు. అదే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనా విషయంలో మాత్రం ట్రంప్ భిన్నవైఖరిని అవలంభించడం విశేషం. యూఎస్ తాజా నిర్ణయంతో ఇరు దేశాలు విధించుకున్న అధిక సుంకాల అమలు నిలిచిపోయింది. అధిక సుంకాల అమలును నవంబర్ 10వ తేదీ అర్ధరాత్రి వరకూ నిలిపివేస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశానని ట్రంప్ తన సామాజిక ట్రూత్ సోషల్ మాధ్యమ వేదికలో ప్రకటించారు. అటు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ కూడా మంగళవారం ఉదయం సుంకాల విధింపునకు విరామం ప్రకటించింది. వాణిజ్యం, పెట్టుబడుల పరిమితి జాబితాలోకి అమెరికా సంస్థలను చేర్చడాన్ని కూడా 90 రోజులు వాయిదా వేసింది. చైనా వస్తువులపై అమెరికా 145 శాతం వరకూ సుంకాలు విధించకుండా తాజా కార్యనిర్వాహక ఆదేశాలు నిరోధిస్తాయి. అలాగే అమెరికా వస్తువులపై చైనా కూడా 125 శాతం టారిఫ్ విధించదు. ప్రస్తుతం చైనా దిగుమతులపై అమెరికా 30 శాతం, అమెరికా దిగుమతుల పై చైనా 10 శాతం సుంకాలు విధిస్తున్నాయి. 'ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలలో పరస్పర వాణిజ్యం లేకపోవడం, దాని ఫలితంగా తలెత్తే జాతీయ, ఆర్థిక భద్రతా సమస్యలను పరిష్కరించడానికి చైనాతో అమెరికా చర్చలు కొనసాగిస్తుంది' అని ట్రంప్ తన ఉత్తర్వులలో తెలియజేశారు. కాగా చైనా, అమెరికా మధ్య సుంకాలపై గతంలో కుదిరిన ఒప్పందం మంగళవారం మధ్యాహ్నం ముగిసింది. తాజాగా గడువు పొడిగించడంతో క్రిస్మస్ సీజన్ కోసం దిగుమతులను పెంచుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. ముఖ్యంగా తక్కువ సుంకాలతో ఎలక్ట్రానిక్స్, దుస్తులు, బొమ్మలు సహా పలు వస్తువులను అమెరికా దిగుమతి చేసుకోవచ్చు.

# ఢిల్లీలో సర్‌పై సమరం: రాహుల్




**న్యూఢిల్లీ:** బీహార్ ఎన్నికల ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) వివాదం ప్రతిపక్షాల నిరసనలతో దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం ఉద్రిక్తతకు దారితీసింది. ఇంతవరకూ విపక్షాలు కాంగ్రెస్ నాయకత్వంలో సర్‌పై పార్లమెంట్‌లో, ఆవరణలో నిరసన హోరు సాగించాయి. ఇప్పుడు ఎన్నికల సంఘం కార్యాలయం వరకూ సాగిన విపక్షాల ప్రదర్శన వేడిని రగిలించింది. నిబంధనలనకు విరుద్ధంగా ప్రతిపక్షాల మార్చ్ ఉందని పేర్కొంటూ మార్గమధ్యంలోనే పోలీసులు వారిని అడ్డుకున్నారు. బారికేడ్లు పెట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ దశ లో ప్రదర్శనకు సారధ్యం వహిస్తున్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని, ప్రియాంకను, మల్లిఖార్జున ఖర్గేను ఇతర విపక్ష అగ్రనేతలను పోలీసు బలగాలు అడ్డగించి అదుపులోకి తీసుకున్నాయి. రాహుల్ ఇతరులు ప్రతిఘటిస్తుండగానే వారిని పోలీసు వాహనాలలోకి ఎక్కించి పోలీసు స్టేషన్లకు తరలించారు. దీనితో కార్యకర్తలు ఇతర నేతల నుంచి నిరసనలు, నినాదాలు హోరెత్తాయి. తీవ్రస్థాయి ఉత్కంఠనడుమ ఈ ఘట్టాలు చోటు చేసుకున్నాయి. పార్లమెంట్ హౌస్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వరకూ ప్రతిపక్షాలు ప్రదర్శన చేపట్టాయి. అంతకు ముందు పార్లమెంట్‌లో సర్‌కు వ్యతిరేకంగా నిరసనలు గందరగోళం మధ్య సభా కార్యక్రమాలు కుంటుతూ సాగాయి. తాము దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు బయలుదేరామని, ఇది రాజకీయ పోరు కాదని పోలీసులు నిర్బంధించిన తరువాత జీపులో రాహుల్ గాంధీ తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ పార్టీలకు అతీతంగా సాగుతుందని చెప్పారు. ఈ నిరసనలు ఆగబోవని ప్రకటించారు. ఒక వ్యక్తి ఒక ఓటు కోసం ప్రతిపక్షాలు ముందుకు వెళ్లుతాయన్నారు. తమ ప్రశ్నలకు ప్రభుత్వం కానీ ఇసి కానీ జవాబు ఇవ్వలేదు. ఎందుకంటే తమ ప్రశ్నలు నిజాయితీతో వాస్తవికతతో ఉన్నాయని రాహుల్ చెప్పారు. సత్యం ముందు వక్రీకరణలకు మాట చెల్లనేరదన్నారు. ప్రజల ఓటు హక్కు రక్షణకు తాము ఉద్యమిస్తున్నామని ఖర్గే చెప్పారు. బిజెపి కుట్రలను ఇండియా కూటమి వెలుగులోకి తీసుకువస్తున్నారు. ఈ దశలో వారిని ముందుగా పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు ఠాణాకు తీసుకువెళ్లారు. కొద్దిసేపటి తరువాత విడిచిపెట్టారు.

# యుద్ధం ముగియాలి: ప్రధాని నరేంద్ర మోడీ



**న్యూఢిల్లీ:** ఉక్రెయిన్ సంఘర్షణకు శాంతియుత పరిష్కారం సాధించే దిశగా భారత దేశం స్థిర మైన వైఖరిని పాటిస్తుందని ప్రధాని మోడీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి స్పష్టం చేశారు. ఉక్రె యిన్‌లో తాజా పరిణామాలపై ప్రధాని నరేం ద్రమోడీ, జెలెన్స్కీ సోమవారం టెలిఫోన్ ద్వారా చర్చించారు. ఈ సందర్భంగా జెలెన్స్కీ తమ దేశ పరిస్థితులు,ఇటీవల జరిగిన పరిణామాలపై మో డీతో తన అభిప్రాయాలను పంచుకున్నారు. పుతిన్, ట్రంప్ త్వరలో భేటీ కానున్న నేపథ్యంలో ఉక్రె యిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో ప్రధాని మోడీ చ ర్చించడం గమనార్హం. ఉక్రెయిన్ సంఘర్షణ నివారించడానికి వీలైనంత త్వరలో శాంతియు త పరిష్కారం సాధించే దిశలో భారత్ స్థిరమైన వైఖ రిని అనుసరిస్తుందని సోషల్ మీడియా పోస్ట్‌లో మోడీ తెలియజేశారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతోసహా అన్ని ముఖ్యమైన అంశాలను మోడీతో చర్చించినట్టు జెలె న్స్కీ తెలియజేశారు. రష్యాకు వ్యతిరేకంగా విధించిన ఆంక్షల గురించి మాట్లాడుతూఏ రష్యా నుంచి చమురు ఎగుమతులను పరిమితం చేయడం తప్పనిసరి అని సూచించారు.



# ఓట్ల చోరీపై వినూత్న నిరసన

న్యూఢిల్లీ : ఓట్ల చోరీ (ఓట్ల దొంగతనం) కి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు వినూత్న నిరసన చేపట్టాయి. పార్లమెంట్ ఆవరణలోని మకర్ ద్వార్ వద్ద మంగళవారం ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం డిమాండ్ చేశారు. బీజేపీ పిరికిచర్య.. నియంతృత్వం.. మా గళాన్ని ఆపలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, ప్రజల ఓటు హక్కు కోసం తాము పోరాడుతామని నినదించారు. ఇటీవల బీహార్‌లో విడుదలైన ఓటరు ముసాయిదా జాబితాలో మింతా దేవి(124) మహిళను గుర్తించడంపై టిషర్టులు ధరించి ఎంపీలు ఆందోళన చేపట్టారు. మింతా దేవి ఫొటో ఉన్న టీషర్టులు, వాటిపై 124 నాటౌట్ అని రాసి ఉన్న వాటిని ధరించి నిరసనలో పాల్గొన్నారు. నినాదాల హోరెత్తించారు. అంతేకాక ఈ అంశాన్ని సీరియస్‌గా ప్రజల ముందుకు తీసుకొచ్చారు. ఈ టీ-షర్టులు కేవలం నిరసన సాధనాలు మాత్రమే కావని, ఈ సమస్య తీవ్రత గురించి చెప్పడమే తమ ఉద్దేశమని అన్నారు. పార్లమెంటు ఆవరణలో జరిగిన ఈ ఆందోళనలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత సోనియా గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, టీఎంసీ ఎంపీ డెరెక్ ఓ బ్రెయిన్, డీఎంకే ఎంపీలు టిఆర్ బాలు, తిరుచ్చి శివ, కనిమొళి, ఎన్‌సీపీ నేత సుప్రియా సులే, సీపీఐ(ఎం) ఎంపీలు జాన్ బ్రిట్టాస్, అమ్రారామ్, రాధాకృష్ణన్, శివదాసన్, ఎస్. వెంకటేషన్, ఎఎ రహీమ్, సీపీఐ ఎంపీ సంతోష్ కుమార్, ఎస్‌పీ ఎంపీ రాంగోపాల్ యాదవ్, ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ రఘ,జేఎంఎం ఎంపీ మహువా మాంరీఇ, శివసేన ఎంపీ అరవింద్ సావంత్ తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు. మరోవైపు పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు వాయిదాల పర్వం తొక్కాయి.

# ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు పౌరసత్వాన్ని నిరూపించవు

**ముంబై:** ఆధార్, పాన్, ఓటర్ ఐడీలు సదరు వ్యక్తుల పౌరసత్వాన్ని నిరూపించవని, అవి కేవలం గుర్తింపు కార్డులేనని బాంబే హైకోర్టు తేల్చిచెప్పింది. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌లో ప్రవేశించాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న బాబూ అబ్దుల్ రూఫ్ సర్దార్‌కు బెయిల్ ఇచ్చేందుకు జస్టిస్ అమిత్ బోర్కార్ ధర్మాసనం నిరాకరించింది. రాజ్యాంగంలోని సిటిజన్‌షిప్ చట్టం ప్రకారం మాత్రమే పౌరుల పౌరసత్వాన్ని నిర్ణయించగలమని, అంతేకానీ ఆధార్, పాన్, ఓటర్ ఐడీలతో కాదని ధర్మాసనం పేర్కొంది. ఈ కార్డులు గుర్తింపు కోసం, అలాగే ప్రభుత్వ సేవల లబ్ది పొందేందుక మాత్రమే ఉపయోగపడతాయని తెలిపింది. అబ్దుల్ సర్దార్ అక్రమంగా భారత్‌లో ప్రవేశించడమే కాకుండా ఆధార్, పాన్, ఓటర్, భారత పాస్ పోర్టు తదితర నకిలీ ధ్రువపత్రాలను కూడా పొందాడని పోలీసులు చెప్తున్నారు. అతనికి బెయిల్ ఇస్తే పారిపోయే ప్రమాదం ఉందన్న వారి వాదనతో కోర్టు కూడా ఏకీభవించింది. 'పౌరసత్వాన్ని 1955 సిటిజన్‌షిప్ చట్టం ప్రకారమే నిర్ధారించాలి. కేవలం ఆధార్, పాన్, ఓటర్ ఐడీలు ఏంటే వాళ్లు భారత పౌరులు అయిపోరు' అని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది.



# అమెరికాలో మరోసారి కాల్పులు..

అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం సృష్టించాయి. టెక్సాస్‌లోని ఆస్టిన్ టార్గెట్ పార్కింగ్ స్థలంలో ఒక దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. పలువురు గాయపడినట్లు తెలుస్తోంది. టెక్సాస్‌లోని ఆస్టిన్‌లోని టార్గెట్ స్టోర్ పార్కింగ్ స్థలం దగ్గర మానసిక రుగ్మతతో బాధపడుతున్న 30 ఏళ్ల యువకుడు తుపాకీతో కాల్పులకు తెగబడ్డాడు. సంఘటనాస్థలిలోనే ముగ్గురు ప్రాణాలు వదిలారు. అనంతరం నిందితుడు పారిపోతూ రెండు వాహనాలను దొంగిలించాడు. ఆస్టిన్ పోలీస్ చీఫ్ లిసా డేవిస్ మాట్లాడుతూ.. అనుమానితుడిని దక్షిణ ఆస్టిన్‌లో దాదాపు 32 కిలోమీటర్ల దూరంలో పట్టుకున్నట్లు తెలిపింది. అయితే ఈ సంఘటనపై పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పౌరులకు రక్షణ కల్పించడంలో ట్రంప్ ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. దేశానికి మెరుగైన భద్రత అవసరం అంటూ నిలదీశారు. తక్షణమే ట్రంప్, గ్రేగ్ అబాట్ మంగళవారం తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు కేసే నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇక బాధితుల గురించి ఎలాంటి వివరాలు వెల్లడిరచలేదు. నలుగురు బాధితులు ఉండొచ్చని పేర్కొన్నారు. కాల్పులకు కారణాలేంటో కూడా తెలియజేయలేదు. ప్రస్తుతం కేసు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# మా నీటిని అడ్డుకుంటే.. యుద్ధమే



సింధు జాలాల విషయంలో పాకిస్తాన్ మరోసారి భారత్ కు వార్నింగ్ ఇచ్చింది. అమెరికా పర్యటన సందర్భంగా పాక్ ఆర్మీ చీఫ్ భారత్ పై అణు బెదిరింపు వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. భవిష్యత్తులో భారత్ నుండి తమ దేశం ఉనికికి ముప్పును ఎదురైతే.. పాకిస్తాన్, భారత్ తోపాటు సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామని హెచ్చరించాడు. తాజాగా పాక్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ కూడా భారత్ ను హెచ్చరించాడు. తమ దేశానికి హక్కుగా చెందిన ఒక్క చుక్క నీటిని కూడా భారత్ ను తీసుకోనివ్వమని ప్రతిజ్ఞ చేశారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాన మంత్రి షరీఫ్ మాట్లాడుతూ.. తమకు దక్కాల్సిన నీటిని ఆపడానికి భారత్ ప్రయత్నిస్తే.. యుద్ధ చర్యగా పరిగణిస్తామని హెచ్చరించాడు. మీరు మా నీటిని నిలిపేస్తామని బెదిరిస్తే, మీరు పాకిస్తాన్ నుండి ఒక్క చుక్కను కూడా లాక్కోలేరని గుర్తుంచుకోండి. భారత్ అలాంటి చర్యకు ప్రయత్నిస్తే.. తగిన గుణపాఠం నేర్పుతాం'' అని హెచ్చరించాడు. కాగా.. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రవాద దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఉగ్రదాడి నేపథ్యంలో భారత ఆర్మీ.. పాకిస్థాన్ లోని ఉగ్రవాదుల శిభిరాలను మిస్సైల్స్‌తో ధ్వంసం చేసింది. అలాగే, ఉగ్రవాదులకు పాక్ సహకరిస్తుందని.. సింధు నది జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది.

# భారత్ వెనక్కి తగ్గట్లేదు

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై భారీగా సుంకాల భారాన్ని మోపారు. ఈ విషయంపై తాజాగా అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ మాట్లాడుతూ.. సుంకాలు విధించినప్పటికీ వాణిజ్య చర్చల విషయంలో భారత్ కాస్త కూడా వెనక్కి తగ్గడం లేదని అన్నారు. దీనివల్ల చర్చలు నెమ్మదిగా సాగుతున్నట్లు పేర్కొన్నారు. భారత్‌తో సహా స్విట్జర్లాండ్, ఇతర దేశాలతో పెద్ద పెద్ద వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరగబోతున్నాయని అన్నారు. అక్టోబర్ చివరి నాటికి న్యూదిల్లీ సహా అన్ని ముఖ్యమైన దేశాలతో చర్చలు ముగిసే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా ట్రంప్ యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దని ట్రంప్ హెచ్చరించినా భారత్ పట్టించుకోలేదు. దీంతో భారీగా సుంకాలు విధించారు. ఇప్పటికే 25% సుంకాలను విధించిన ఆయన.. దానిని 50 శాతానికి పెంచారు. ఆ 25 శాతం అదనపు సుంకాలు ఈనెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే, ట్రంప్ టారిఫ్‌లకు భారత్ కూడా దీటుగా స్పందించింది. దేశంలోని రైతులు, మత్స్యకారులు, పాల ఉత్పత్తుల రంగంలోని వారి ప్రయోజనాలే తమకు ముఖ్యమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. అవసరమైతే ఆ భారాన్ని తామే మోస్తామన్నారు. టారిఫ్‌ల నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సంబంధాల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ న్యూదిల్లీతో పూర్తిస్థాయి చర్చల్లో పాల్గొంటామని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి టామీ పిగోట్ ఇప్పటికే స్పష్టం చేశారు.

# వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరకులు

**చెన్నై:** తమిళనాడులో 70 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులకు 'ముఖ్యమంత్రి తాయుమానవర్(తల్లి) పథకం' కింద ఇంటి వద్దకే రేషన్ సరకులు డెలివరీ చేసే విధానాన్ని తమిళనాడు ప్రభుత్వం మంగళవారం ప్రారంభించింది. దీనివల్ల 21 లక్షల మంది ప్రయోజనం పొందుతారని, ఇది తన హృదయానికి నచ్చిన పథకం అని ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అన్నారు. లబ్ధిదారుల ఇంటివద్దకే సరకులు తీసుకెళ్లే వాహనాలకు జెండా ఊపి ఆయన మరీ ఈ పథకాన్ని ప్రారంభించారు. అంతేకాదు ఆయన కొందరు లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి సరకులు అందించారు. వృద్ధులు, వికలాంగులు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకునే ఆయన ఈ పథకాన్ని ఆరంభించారు. ఈ పథకాన్ని ఆరంభించినందుకు తనకు ఆనందంగా ఉందని స్టాలిన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ పథకాన్ని తమిళనాడులోని 34,809 ఫెయిర్ ప్రైస్ షాప్స్‌లో అమలుచేస్తున్నారు. దీనివల్ల 21,70,454 మందికి లబ్ధి చేకూరనున్నది. వీరిలో చాలా వరకు వృద్ధులేనని చెప్పాలి. ఈ పథకంలో అదనంగా వచ్చే రూ. 30.16 కోట్లను మేము ఖర్చుగా భావించడంలేదు, ఇంటివద్దకే సరకులు అనే విషయంలో తమిళనాడు 'మార్గదర్శకం' అన్నారు. తమిళనాడులో రేషన్ దుకాణాలు మొత్తం 37328 ఉన్నాయి. వీటిలో గత నాలుగేళ్లలో చేర్చిన 2,394 షాపులు డిఎంకె ప్రభుత్వ హయాంలో చేర్చినవేనన్నారు. నేడు తమిళనాడులో ఆకలి చావులు లేవని సగర్వంగా తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఇంటివద్దనే రేషన్ సరకులను సిబ్బంది అందిస్తారని కూడా స్టాలిన్ స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రిలీజ్‌కు ముందే వంద కోట్లు



ఒకప్పుడు సౌత్ ఇండియాలో రజినీకాంత్‌ను మించిన స్టార్ లేడు అన్నట్లుండేది పరిస్థితి. ఆయన సినిమాల బడ్జెట్లు, బిజినెస్‌లు, వసూళ్లు అన్నీ కూడా వేరే లెవెల్లో ఉండేవి. వంద కోట్ల వసూళ్లు వస్తే అద్భుతం అనుకునే రోజుల్లోనే 'రోబో' మూవీతో వందల కోట్ల వసూళ్లు తెచ్చిపెట్టిన ఘనత ఆయన సొంతం. ఐతే గత కొన్నేళ్లలో రజినీ నటించిన పలు చిత్రాలు తీవ్రంగా నిరాశపరిచాయి. 'జైలర్'ను మినహాయిస్తే అన్నీ ఫెయిల్యూర్లే. పేట, పెద్దన్న, వేట్టయాన్ లాంటి చిత్రాలకు అయితే అసలు హైపే లేదు. 'జైలర్' కూడా రిలీజ్ తర్వాతే పుంజుకుంది. కానీ సూపర్ స్టార్ కొత్త చిత్రం 'కూలీ' సంగతి మాత్రం వేరు. ఈ సినిమా మొదలైన దగ్గర్నుంచే మంచి హైప్ తెచ్చుకుంది. రిలీజ్ టైంకి ఆ హైప్ మల్టిప్లై అయింది. గత కొన్నేళ్లలో ఇంత హైప్ తెచ్చుకున్న సినిమా ఇంకోటి లేదు అనే పరిస్థితి కనిపిస్తోంది. 'కూలీ'కి అడ్వాన్స్ బుకింగ్స్ అలా జరుగుతున్నాయి మరి. 'కూలీ' ఫస్ట్ షో పడడానికి ముందే వసూళ్లు రూ.100 కోట్లను టచ్ చేసేలా కనిపిస్తుండడం విశేషం. ఇప్పటికే వరల్డ్ వైడ్ అడ్వాన్స్ బుకింగ్స్‌తో ఈ చిత్రం రూ.70 కోట్ల దాకా రాబట్టింది. సినిమా రిలీజ్ కావడానికి ఇంకా ఒక రోజు పైన సమయం ఉంది కాబట్టి.. ఆలోపు బుకింగ్స్‌తో రూ.100 కోట్ల మార్కును టచ్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.



# సౌత్ క్యారెక్టర్లే గొప్ప..

సౌత్‌లో కొన్ని సినిమాలు చేసి బాలీవుడ్‌కు వెళ్లే హీరోయిన్లందరూ.. ఇక్కడి సినిమాలను తక్కువ చేసి మాట్లాడ్డం ఎన్నో సందర్భాల్లో జరిగింది. చాలామంది ఇక్కడి సినిమాలను డీగ్రేడ్ చేసిన వాళ్లే. కెరీర్ బాగున్నంత కాలం తమ వద్దకు వచ్చే గ్లామర్ పాత్రలకు ఓకే చెప్పి సినిమాల్లో నటిస్తారు. కానీ ఇక్కడ డౌన్ అయి అక్కడ కొన్ని మంచి పాత్రలు పడగానే.. సౌత్ వాళ్లు తమ టాలెంట్‌ను గుర్తించలేదని.. గ్లామర్ డాల్ లాగా చూశారని.. సరైన పాత్రలు ఇవ్వలేదని బురదజల్లే ప్రయత్నం చేస్తారు. ఐతే పూజా హెగ్డే మాత్రం దీనికి భిన్నంగా మాట్లాడి ఆశ్చర్యపరిచింది. ఆమె స్వతహాగా బాలీవుడ్ హీరోయినే. కానీ తెలుగు, తమిళంలోనే మంచి పాత్రలు పడ్డాయి.హిట్లు కూడా ఇక్కడే వచ్చాయి. ఐతే ఈ మధ్య తెలుగులో ఆమెకు ఛాన్సులు తగ్గాయి. తమిళంలో కొంచెం బిజీ అయింది. హిందీలో కూడా అవకాశాలకు లోటు లేదు. ఐతే ఒక ఇంటర్వ్యూలో పూజా మాట్లాడుతూ.. బాలీవుడ్ తనకు సరైన పాత్రలు ఇవ్వలేదని వాపోయింది. అక్కడి వాళ్లు తనను గ్లామర్ హీరోయిన్ లాగే చూశారని.. పెద్దగా గుర్తింపు లేని పాత్రలే ఇచ్చారని వ్యాఖ్యానించింది. కానీ సౌత్ సినిమాల్లో మాత్రం తనకు మంచి మంచి క్యారెక్టర్లు దొరికాయని ఆమె చెప్పింది. చివరగా తాను నటించిన 'రెట్రో' సినిమాలో కార్తీక్ సుబ్బరాజ్ అద్భుతమైన పాత్ర డిజైన్ చేశాడని.. తాను ఎలా పెర్ఫామ్ చేయగలనో ఆ సినిమా చూపించిందని ఆమె చెప్పింది. ఇలాంటి పాత్రలు మరిన్ని చేయాలని ఉందని పూజా పేర్కొంది. తెలుగులో కూడా పూజా అరవింద సమేత, రాధేశ్యామ్ లాంటి చిత్రాల్లో నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలే చేసింది. బాలీవుడ్లో మాత్రం 'మొహెంజదారో'లో మినహాయిస్తే దాదాపుగా అన్నీ గ్లామర్ క్యారెక్టర్లే చేసింది పూజా.

# కాంతార కష్టాల వెనుక అసలు కథ



కేవలం పదహారు కోట్లతో తీసిన ఒక మీడియం బడ్జెట్ సినిమా ఏకంగా నాలుగు వందల కోట్లు వసూలు చేస్తుందని ఎవరు ఊహిస్తారు. కానీ కాంతార సాధ్యం చేసి చూపించింది. అందుకే దాని ప్రీక్వెల్ కాంతార చాప్టర్ 1 మీద విపరీతమైన అంచనాలు ఏర్పడ్డాయి. హోంబాలే ఫిలిమ్స్ ఈసారి బడ్జెట్ ని కూడా అమాంతం పెంచేసింది. అయితే ఈ మూవీ ప్రారంభ దశ నుంచే విపరీతమైన అవాంతరాలు, ప్రమాదాలు ఎదురుకుంది. ఇదంతా దేవుడి శాపమని, ఆపమనే దానికి సూచనని రకరకాల ప్రచారం జరిగింది. దీనికి నిర్మాతల్లో ఒకరైన చలువే గౌడ స్పందిస్తూ కాంతార కష్టాల వెనుక అసలు కథ చెప్పారు. కాంతార స్టార్ట్ చేసినప్పటి నుంచి సినిమాకు సంబంధించి జరిగింది తక్కువ ప్రమాదాలే. నవంబర్ 2024 కొల్లూరు సెట్ లో జరిగిన అగ్ని ప్రమాదం వల్ల కొందరు యూనిట్ సభ్యులు గాయపడ్డారు. తర్వాత జనవరి 2025లో మరొక సెట్ లో ఫైర్ యాక్సిడెంట్ అయినప్పటికీ ఎవరికీ గాయాలు, ప్రాణ నష్టం జరగలేదు. కొన్ని నెలల క్రితం హీరో కం దర్శకుడు రిషబ్ శెట్టి పడవ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కెమెరా లాంటి పరికరాలు నీటిలో మునిగిపోయాయి తప్పించి ఎవరికి ఏం కాలేదు. కాంతార చాప్టర్ 1 మొదలుపెట్టడానికి ముందే గ్రామదేవత పంజుర్లీని అడిగితే కొన్ని అవాంతరాలు వచ్చినా నిర్విఘ్నంగా పూర్తి చేస్తారని చెప్పింది. దీంతో చిత్ర బృందం చిత్రీకరణ మొదలుపెట్టి దిగ్విజయంగా విడుదలకు రెడీ చేస్తోంది. మధ్యలో జరిగిన కొన్ని ప్రమాదాలు, మరణాలు షూట్ కి ఏ మాత్రం సంబంధం లేనివి. రోజు ఉదయం 6 గంటలకు మొదలయ్యే షూటింగ్ ఏకధాటిగా జరిగేది. దాని కోసం ఉదయం నాలుగు గంటలకే టీమ్ మొత్తం లేవాల్సి వచ్చింది. ఎనభై శాతానికి పైగా రియల్ లొకేషన్లలోనే కాంతార తీశారు. అక్టోబర్ 2 రిలీజ్ కాబోతున్న కాంతార చాప్టర్ 1 కు భారీ బిజినెస్ ఆఫర్స్ ఉన్నాయి. ఇంకా ఎవరిని ఫైనల్ చేయలేదు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన హక్కులకు కనివిని ఎరుగని రేట్ పలకొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# తండ్రి కాబోతున్న మహేష్



జబర్దస్త్ షో ద్వారా చాలామంది పాపులారిటీ సంపాదించుకున్నారు. అలా ఫేమస్ అయిన వారిలో మహేష్ ఆచంట ఒకరు.ఈ షోలో తన కామెడీతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాడు మహేష్. దీంతో రామ్ చరణ్ నటించిన 'రంగస్థలం' మూవీలో నటించే చాన్స్ వచ్చింది. ఆ తర్వాత చాలా చిత్రాల్లో కమెడియన్‌గా నటించి మెప్పించాడు. ప్రస్తుతం వరుస సినిమాల్లో నటిస్తూ స్టార్ కమెడియన్‌గా గుర్తింపు పొందుతున్నారు. ఇదిలా ఉంటే.. మహేష్ తాజాగా తన ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ చెప్పాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ షేర్ చేశాడు. అందులో తన భార్య అండ్ పాపతో దిగిన క్యూట్ ఫొటోస్ షేర్ చేశాడు. అయితే ఈ పిక్స్‌లో మహేష్ భార్య కడుపుతో ఉండటం విశేషం. దీంతో అతను మరోసారి తండ్రి కాబోతున్నాడనే విషయం అందరికీ తెలిసిపోయింది. ఇక ఈ ఫొటోస్‌కి 'ఒక అందమైన కొత్త అధ్యాయానికి నాంది' అనే క్యాప్షన్ జోడిరచింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. ఇక దీన్ని చూసిన నెటిజన్లు ఈ జంటకు కంగ్రాట్స్ చెబుతున్నారు.

# సత్యదేవ్ కోరుకున్నది దొరికినట్లేనా?




తెలుగులో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ యంగ్ యాక్టర్లలో సత్యదేవ్ ఒకడు. కానీ తన ప్రతిభకు తగ్గ అవకాశాలు రావట్లేదని.. మంచి బ్రేక్ అందుకోవట్లేదని చాలామంది సినీ ప్రేమికులు బాధ పడుతుంటారు. ఇటీవలే వచ్చిన 'కింగ్డమ్' సినిమాలో కూడా సత్య చేసిన పాత్ర జనాలకు బాగా నచ్చింది. తన పెర్ఫామెన్స్‌కు ప్రశంసలు దక్కాయి. మెగాస్టార్ చిరంజీవి సినిమా 'గాడ్ ఫాదర్' లో విలన్ పాత్ర చేసి చిరుకు దీటుగా నిలబడ్డాడంటే అది తన టాలెంట్ వల్లే. ఇంకా అనేక పాత్రల్లో అతను అదరగొట్టాడు. కానీ హీరోగా మాత్రం కోరుకున్న బ్రేక్ రావట్లేదు. కొన్ని మంచి సినిమాలు చేసినా అవి ప్రేక్షకులకు రీచ్ కాలేదు. తన కెరీర్‌ను మారుస్తాయని అతను బలంగా నమ్మి చేసిన కొన్ని సినిమాలు ఆశించిన ఫలితాన్నందుకోలేదు. మొత్తంగా ఎంతో టాలెంట్ ఉండి కూడా ఒక స్థాయికి మించి ఎదగలేక ఇబ్బంది పడుతున్నాడు. తన కెరీర్ ఇలా ఉండడం మీద ఇటీవల మా ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో సత్యదేవ్ మాట్లాడాడు. తనకు ఓ పెద్ద ప్రొడక్షన్ హౌస్ బ్యాకప్ దొరక్కపోవడం కెరీర్‌కు ప్రతికూలంగా మారిందని సత్యదేవ్ అంగీకరించాడు. పెద్ద బేనర్లలో సినిమాలు చేస్తే వాటి రేంజ్ వేరు ఉంటుందని.. ప్రేక్షకుల రీచ్ కూడా పెరుగుతుందని.. కానీ ఇప్పటి దాకా తనకు ఆ బ్యాకప్ దొరకలేదని సత్యదేవ్ ఒకింత ఆవేదన వ్యక్తం చేశాడు. ఐతే ఇప్పుడు ఏకంగా మహేష్ బాబు సంస్థే సత్యదేవ్ సినిమాను నిర్మిస్తోంది. 'రావ్ బహదూర్' పేరుతో కొత్తగా సత్యదేవ్ హీరోగ్గా ఓ సినిమా అనౌన్స్ అయింది. ఇంతకుముందు సత్యతో 'ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' సినిమా తీసిన వెంకటేష్ మహా (కేరాఫ్ కంచరపాలెం ఫేమ్) ఈ చిత్రానికి దర్శకుడు. గతంలో మహేష్ బాబుతో కలిసి 'మేజర్' సినిమాను ప్రొడ్యూస్ చేసిన ఛాయ్ బిస్కెట్ అధినేతలు అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర.. 'క' నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డితో కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

# నిధి అగర్వాల్‌కు ఇష్టమైన ఫుడ్



టాలీవుడ్ ఇండస్ట్రీలో నిధి అగర్వాల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇస్మార్ట్ శంకర్ సినిమాతో పాపులర్ అయిన ఈ అందాల తార... ఇటీవల హరిహర వీరమల్లు సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. త్వరలోనే ప్రభాస్ నటిస్తున్న రాజా సాబ్ సినిమాతో కూడా మరోసారి మెరువనుంది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తి కాగా... డిసెంబర్ లో మూవీ రిలీజ్ కానుంది. అయితే ఇలాంటి నేపథ్యంలో హీరో ప్రభాస్ అలాగే ఆయన పెద్దమ్మ శ్యామల దేవికి ప్రత్యేక ధన్యవాదాలు చెప్పింది హీరోయిన్ నిధి అగర్వాల్. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియోను కూడా పంచుకుంది. తాజాగా ప్రభాస్ ఇంటి నుంచి...కాకినాడలో ఉన్న హీరోయిన్ నిధి అగర్వాల్ కు భోజనం వచ్చింది. ప్రభాస్ పెద్దమ్మ శ్యామలాదేవి ప్రత్యేకంగా.. ఆహారాన్ని వండి మరీ పంపినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆ వెజిటేరియన్ ఆహారాన్ని తింటూ నిధి అగర్వాల్ వీడియో చేశారు. తనకు ఇష్టమైన వెజిటేరియన్ ఆహారాన్ని ప్రభాస్ ఇంటి నుంచి పంపించారని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభాస్ అలాగే ఆయన పెద్దమ్మ శ్యామలాదేవికి కృతజ్ఞతలు కూడా తెలిపారు హీరోయిన్ నిధి అగర్వాల్. చివరలో ఫ్లయింగ్ కిస్ లు కూడా ఇచ్చారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ గా మారింది.ఇక ప్రభాస్ ఇంటి నుంచి వచ్చిన భోజనం లో పప్పు, సాంబార్, పెరుగు, ఏపీ స్పెషల్ వంటకాలు, స్వీట్స్ ఉన్నాయి.

# ఆ సీక్రెట్ బయటపెట్టిన నటి !



టాలీవుడ్ ఇండస్ట్రీలో చాలా మంది నటీమణులు ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఇందులో కొంత మంది అతి తక్కువ కాలంలో పాపులర్ అయితే... మరి కొంతమంది సక్సెస్ కావడానికి ఇంకా కష్టపడుతున్నారు. ఇక మరికొంతమంది నటీమణులు అయితే... ఏజ్ పైబడినప్పటికీ వరుస ఛాన్స్‌లతో దూసుకు వెళ్తున్నారు. అయితే అలాంటి లేడీ యాక్టర్స్‌లో సుధ ఒకరు. ఈ టాలీవుడ్ ఆంటీ... అనేక పాత్రలో నటిస్తూ.. తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పటివరకు 500 సినిమాల్లో ఆమె నటించింది. అతడు, దూకుడు, బాద్షా, గ్యాంగ్ లీడర్ లాంటి ఎన్నో సినిమాలలో ప్రత్యేక పాత్రల్లో కనిపించారు సుధ. అయితే ప్రస్తుతం ఆమె వయసు 61 సంవత్సరాలు దాటిపోయింది. అయినప్పటికీ యంగ్ హీరోయిన్లకు ఉన్న ఫిట్నెస్ ఆమె కూడా ఉంటుంది. అయితే అలా ఫిట్‌గా ఉండడానికి గల కారణాలను తాజాగా రివీల్ చేసింది నటి సుధ. వాము, వేడి నీళ్లు కలిపి.. నిత్యం తాగుతానని తాజాగా వెల్లడిరచింది. దానివల్ల తాను ఇప్పటికీ కూడా యాక్టివ్ గా కనిపిస్తానని పేర్కొంది. అలా వేడినీళ్లు తీసుకుంటే శరీరంలో కొలెస్ట్రాల్ మొత్తం కరిగిపోతాయని వివరించింది. తాను అలా వేడి నీళ్లు చిన్నప్పటి నుంచి తాగుతున్నానని తెలిపింది. తన హెల్త్ సీక్రెట్ ఆ నీళ్లు మాత్రమేనని వివరించింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in